

www.vibharenews.com

# విభారె

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY




PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి బుధవారం 03-05-2023 సంపుటి : 04 సంచిక : 217 పేజీలు : 4 వెల : రూ 3-00

# ఏపీ వాసులకు అలర్ట్..

**మూడురోజుల పాటు భారీ వర్షాలు**



విశాఖపట్నం: ఆంధ్రప్రదేశ్‌లో రానున్న మూడు రోజుల పాటు విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని విశాఖ వాతావరణ కేంద్రం అధికారి సునంద తెలిపారు.పశ్చిమ విదర్భ నుంచి కర్ణాటక వరకు ద్రోణి ప్రభావం కొనసాగుతోంది. రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో తేలికపాటి వర్షాలతో పాటు, కొన్ని చోట్లు భారీ వర్షాలు పడే అవకాశముందని వాతావరణ శాఖ వెల్లడించింది. గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో గాలులు విస్తాయని సునంద తెలిపారు.మంగళవారం పలు ప్రాంతాల్లో పిడుగులతో కూడిన వర్షాలు కురుస్తున్నాయి. ఉమ్మడి కృష్ణాజిల్లా వ్యాప్తంగా వర్షాలు పడటంతో ప్రజలు, రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిసింది. పార్వతీపురం మన్యం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు, కాకినాడ, అంబేద్కర్ కోనసీమ, పశ్చిమగోదావరి, ఏలూరు, శ్రీ సత్యసాయి, అనంతపురం జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశముందని పేర్కొంది.తీవ్రమైన ఎండలు మండే మే నెలలో ఎన్నడూలేని విధంగా రాష్ట్రమంతా కుండపోత వర్షాలు కురుస్తున్నాయి. ఆదివారం రాత్రి నుంచి అనేక జిల్లాల్లో వర్షాలు దంచికొట్టాయి. ఎన్టీఆర్, కృష్ణా, పశ్చిమ గోదావరి, నంద్యాల, అంబేద్కర్ కోనసీమ, ఏలూరు జిల్లాల్లో భారీ వర్షాలు కురిశాయి. దీంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి.

# ఇళ్ల నిర్మాణంలో పురోగతి చూపించాలి

**ఎలాంటి సాకులు చెప్పడానికి వీలు లేదు**

**ఇళ్లు లేని వారు ఒక్కరు ఉండకూడదన్నదే ప్రభుత్వ లక్ష్యం**

**లేఔట్లలో విద్యుత్, నీటి సరఫరా, డ్రైనేజీ , తదితర మౌలిక సదుపాయాలు**

**మండలానికి ఒక స్పెషల్ ఆఫీసర్ వారంలో ఒకరోజు తనిఖీలు చేయాలి**

**హౌసింగ్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అజయ్ జైన్ వెల్లడి**




పుట్టపర్తి,మే2: ఇళ్లు లేని వారు ఒక్కరు ఉండకూడదన్నదే ప్రభుత్వ లక్ష్యమని హౌసింగ్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అజయ్ జైన్ పేర్కొన్నారు. మంగళవారం శ్రీ సత్యసాయి జిల్లా కేంద్రం పుట్టపర్తి కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో నవరత్నాలు - పేదలందరికీ ఇళ్లు కింద గృహ నిర్మాణ ప్రగతిపై సంబంధిత అధికారులు, జిల్లా కలెక్టర్ పి.అరుణ్ బాబుతో కలిసి అజయ్ జైన్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పెనుకొండ సబ్ కలెక్టర్ కార్తీక్, డిఆర్ఓ కొండయ్య, హౌసింగ్ పిడి చంద్రమౌళి రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా హౌసింగ్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అజయ్ జైన్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 17,18,336 ఇల్లు మంజూరు కాగా, శ్రీ సత్యసాయి జిల్లాకు ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద 62,253 ఇల్లు మంజూరు కావడం జరిగిందన్నారు. ఇందులో ఇప్పటివరకు 55,750 ఇళ్లను మాత్రమే రిజిస్ట్రేషన్ చేయడం జరిగిందని, 52,711 ఇళ్లు గ్రౌండ్ కాగా, 9,542 ఇల్లు ఇంకా మొదలు కాలేదన్నారు. బిలో బేస్మెంట్ స్థాయిలో 22,563 ఇల్లు నిర్మాణంలో ఉండగా, బేస్మెంట్ స్థాయిలో 15,759 ఉన్నాయని, ఇళ్ల నిర్మాణంలో పురోగతి తక్కువగా ఉందన్నారు. జిల్లాలో 1,400 కోట్ల రూపాయల మేర హౌసింగ్ లో పని జరుగుతోందని, నవరత్నాలు - పేదలందరికీ ఇల్లు అనేది అత్యంత ప్రతిష్టాత్మక కార్యక్రమమన్నారు. ఇళ్లనిర్మాణంలో హౌసింగ్ అధికారులతో పాటు ఇతర శాఖల అధికారులు కూడా శ్రద్ధ పెట్టి పని చేయాలన్నారు. హౌసింగ్ కింద కావలసినంత డబ్బు ఉంది, మెటీరియల్ అంతా అందుబాటులో ఉంది, లేఔట్లలో మౌలిక వసతులు కల్పన జరుగుతోంది, అన్ని రకాలుగా అనుకూల పరిస్థితి ఉన్న, ఎక్కడ ఎలాంటి సమస్య లేకున్నా ఇళ్ల నిర్మాణంలో పురోగతి ఎందుకు తక్కువగా ఉందని అధికారులను ప్రశ్నించారు. ఇళ్ల నిర్మాణంలో ఎలాంటి సాకులు చెప్పడానికి వీలు లేదన్నారు. ఎక్కువ ఇళ్లు ఇంకా పునాదులు కూడా పడని పరిస్థితుల్లో ఉన్నాయని, క్షేత్రస్థాయిలో పని చేయని వారికి ఎలాంటి మినహాయింపులు ఉండవన్నారు. ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం 1.80 లక్షల రూపాయలు మంజూరు చేస్తోందని, దాంతోపాటు మరో 35 వేల రూపాయలను రుణంగా అందిస్తున్నారని, 2.15 లక్షల రూపాయలతో ఇల్లు కట్టుకునేందుకు అనుకూలంగా ఉంటుందని, అన్ని రకాలుగా సాయం చేస్తున్న ఇళ్ల నిర్మాణం వేగవంతం కాకపోవడానికి సమస్య ఎక్కడ ఉంది అనేది సరిచేసుకోవాలన్నారు. క్షేత్రస్థాయిలో లబ్దిదారుల ఇళ్లకు వాలంటీర్లు వెళ్లి ఇల్లు ఎందుకు కట్టలేదు అనేది అడగాలన్నారు.

# తుని రైలు దగ్ధం కేసు కొట్టివేయడం హర్షణీయం: కన్నబాబు



కాకినాడ జిల్లా: తుని రైలు దగ్ధం కేసు కొట్టివేయడం హర్షణీయం అని మాజీ మంత్రి కురసాల కన్నబాబు అన్నారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, రాయలసీమ నుంచి రౌడీలు వచ్చారని దుష్ప్రచారం చేయించిన బాబు..కిర్లంపూడిలో కర్ఫ్యూ వాతావరణం సృష్టించి ముద్రగడ కుటుంబం పట్ల చాలా దుర్మార్గంగా వ్యవహరించారని మండిపడ్డారు. 'సీఎం జగన్ ఒక వాస్తవిక వాది.. నిజాన్ని నిర్భయంగా చెప్పగలిగే నాయకుడు' అని కన్నబాబు అన్నారు."తన రాజకీయ అవసరాల కోసం తుని రైలు దగ్ధం కేసును చంద్రబాబు వాడుకున్నాడు. కాపులను సంఘ విద్రోహ శక్తులగా చూపించే ప్రయత్నం చేశాడు. సంబంధం లేని వ్యక్తులపై కూడా కేసులు నమోదు చేశారు. ఆకలి కేకల పేరుతో రోడ్లు మీదకు వచ్చి కంచాలు కొట్టిన మహిళలపైనా కేసులు పెట్టారు." అని ఆయన ధ్వజమెత్తారు.

# 'చంద్రబాబుతో పవన్ కల్యాణ్ కలిసినా కాపులు కలవరు'



అమరావతి: టీడీపీ ప్రభుత్వంలో కాపులపై అనేక కేసులు నమోదు చేశారని.. కేసు కొట్టివేయడం చంద్రబాబు, రామోజీ భరించలేకపోతున్నారని ఏపీ జలవనరులశాఖ మంత్రి అంబటి రాంబాబు దుయ్యబట్టారు.మంగళవారం ఆయన తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ,టీడీపీ హయాంలో కాపులను హింసించారని.. కాపు ఉద్యమంలో కాపు నేతలందరిపై 69 కేసులు చంద్రబాబు పెట్టించారని మండిపడ్డారు."ముద్రగడ, దాడిశెట్టి రాజా సహా అనేక మందిపై అక్రమ కేసులు పెట్టారు. కాపులపై అన్యాయంగా పెట్టిన కేసులను కోర్టు కొట్టివేసింది. రాజకీయ కక్షతోనే చంద్రబాబు కేసులు పెట్టించారు. చంద్రబాబు ప్రోద్భలంతోనే వంగవీటి మోహనరంగా హత్య జరిగింది. చంద్రబాబు హయాంలో కాపులపై పెట్టిన అన్ని కేసులను కేవలం ఒకే ఒక్క జీవోతో సీఎం జగన్ ఎత్తివేశారు. కాపులను హింసంచడమే టీడీపీ పని.. టీడీపీ కాపు వ్యతిరేక పార్టీ. కాపుల విషయంలో చంద్రబాబు సైకోలా వ్యవహరించారు" అని మంత్రి అంబటి రాంబాబు మండిపడ్డారు."పవన్ కల్యాణ్ ఒక అజ్ఞాని.. ఆయన చంద్రబాబుతో కలిసినా కాపులు కలవరు. కాపులను సర్వనాశనం చేయడమే టీడీపీ లక్ష్యం. పవన్ కల్యాణ్‌కు అసలు చరిత్రే తెలియదు కాపులతో చంద్రబాబు పల్లకీ మోయించాలని పవన్ చూస్తున్నాడు. ప్యాకేజీ తీసుకుని కాపులను బాబుకు తాకట్టు పెట్టాలని పవన్ యత్నం. పవన్ కల్యాణ్ వైఖరి పట్ల కాపులంతా అప్రమత్తంగా ఉండాలి. ఒక పార్టీలో ఉండి వేరే పార్టీవారితో కలవడం పవన్‌కు అలవాటే. కాపులను అణచివేసిన పార్టీ టీడీపీ" అని మంత్రి అన్నారు.

# చంద్రబాబు తిరుపతి పర్యటన వాయిదా

**4నుంచి తిరిగి ప్రారంభించనున్న యాత్ర**

అమరావతి,మే2 : టీడీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తిరుపతి పర్యటన వాయిదా పడింది. ఈ నెల 2, 3, 4 తేదీల్లో జరగాల్సిన బాబు పర్యటన రెండు రోజుల పాటు వాయిదా పడింది. వర్షాల కారణంగా తిరుపతి జిల్లాలో బాబు తన పర్యటనను రెండ్రోజులు వాయిదా వేసుకున్నారు. ఈ నెల 4 వ తేదీ నుండి మూడ్రోజుల పాటు తిరుపతి జిల్లాలో చంద్రబాబు పర్యటించ నున్నారు. ఈ మేరకు టీడీపీ పార్టీ కేంద్ర కార్యాలయ వర్గాలు ప్రకటించాయి. మే 4వ తేదీన సూళ్లూరుపేట, 5న గూడూరు, 6న వెంకటగిరి నియోజకవర్గాల్లో బాబు పర్యటిస్తారు. 'ఇదేం కర్మ మన రాష్ట్రానికి' పేరుతో నిర్వహించనున్న కార్యక్రమంలో చంద్రబాబు నాయుడు పాల్గొంటారు. రోడ్ షోలు నిర్వహిస్తారు. పలు ప్రాంతాల్లో ప్రసంగించనున్నారు. 'ఇదేం కర్మ మన రాష్ట్రానికి' కార్యక్రమాన్ని మళ్లీ వేగవంతం చేయాలని పార్టీ నిర్ణయించింది. దీనికి అనుగుణంగా ప్రణాళికలు రూపొందించుకోవాలని, అన్ని నియోజకవర్గాల్లో వేగవంతంగా ఈ కార్యక్రమం చేపట్టాలని పార్టీ నాయకులకు ఇప్పటికే ఆదేశాలు ఇచ్చారు చంద్రబాబు. వైసీపీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి టీడీపీపై ఆదరణపెంచే విధంగా ప్రయత్నాలు చేయాలని పార్టీ నేతలకు బాబు సూచనలు చేశారు.

# అమ్మ చేతి ముద్ద ఎప్పుడూ అమృతమే

**మన సంప్రదాయ వంటలే మనకు బలం**

**పాక ఇడ్లీ తిన్న వెంకయ్యనాయుడు.. అశ్చర్యపోయిన యజమాని**

విజయవాడ మే 2 సంప్రదాయ వంటలనే ఆహారపు అలవాట్లుగా మార్చుకోవాలని మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు సూచించారు. నగరంలోని మున్సిపల్ ఎంప్లాయూస్ కాలనీ నూూ ఇడ్లీ సెంటర్ (పాక ఇడ్లీ)లో మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు టిఫిన్ చేశారు. పిజ్జా, బగ్గర్లు ద్వారా ఆరోగ్యాన్ని పాడు చేసుకుంటున్నారని చెప్పారు. యువతకు కూడా మన వంటకాల రుచులను చూపించి అలవాటు చేయాలన్నారు. ఈ విషయంలో తల్లిదండ్రులు శ్రద్ధ పెట్టాలని ఆయన సూచించారు. అమ్మ చేతి ముద్ద ఎప్పుడూ అమృతమేనన్నారు. అలాగే మన సంప్రదాయ వంటలే మనకు బలమన్నారు. వ్యాయామం మనకి ఎంత ముఖ్యమో మన వంటలే తినడం అంతే ముఖ్యమని తెలిపారు. తాను ఎటువంటి రాజకీయ వ్యాఖ్యలు చేయనన్నారు. మాజీ మంత్రి కామినేని శ్రీనివాసరావు తో కలిసి వెంకయ్య నాయుడు నేతి ఇడ్లీ తిన్నారు. ఈ ఇడ్లీ తినేందుకే గన్నవరం నుంచి ప్రత్యేకంగా వెంకయ్యనాయుడు విజయవాడ వచ్చారు. నాణ్యమైన ఇడ్లీ అందిస్తున్నారని హోటల్ యజమాని కృష్ణ ప్రసాద్‌ను ప్రత్యేకంగా ఆయన అభినందించారు. ఈ సందర్భంగా వెంకయ్యనాయుడు మాట్లాడుతూ... పాక ఇడ్లీ అంటే తనకు చాలా ఇష్టమన్నారు. గతంలో ఎప్పుడో ఒక్కసారి ఇక్కడ ఇడ్లీ తిన్నానని గుర్తుచేశారు. నాణ్యమైన ఇడ్లీ తినాలనిపించి ఇక్కడకు వచ్చానని పేర్కొన్నారు.అలాగే పాక ఇడ్లీ యజమాని కృష్ణప్రసాద్ మాట్లాడుతూ... నలభై యేళ్లుగా ఇక్కడ ఇడ్లీ సెంటర్‌ను నడుపుతున్నామని తెలిపారు. "మా నాన్న. మల్లికార్జున రావు ఈ హోటల్‌ను స్థాపించారు.

# అదే జరిగితే వచ్చే ఎన్నికల్లో మా పార్టీ పని అవుట్: ఎంపీ రఘురామ



విజయవాడ మే 2 , తెలుగుదేశం, జనసేన పార్టీలు కలిశాయంటే తమ పార్టీ పని అవుట్ అన్నారు నరసాపురం ఎంపీ రఘురామకృష్ణ రాజు. నెల్లూరు నుంచి శ్రీకాకుళం వరకు స్థానికంగా బలం కలిగిన ఐదారు మంది నాయకులు రానున్న ఎన్నికల్లో తమ పార్టీ తరపున ఎమ్మెల్యేలుగా గెలవవచ్చునని చెప్పుకొచ్చారు. ఇప్పటికీ రాయలసీమలో తమ పార్టీకి ఎంతో కొంత బలం ఉందని.. అక్కడ కూడా ఎంపీ అవినాష్ రెడ్డి అరెస్ట్ అయితే తమ పార్టీ పరిస్థితి దారుణంగా ఉంటుందన్నారు. తెలుగుదేశం, జనసేన పార్టీలు కలిస్తే తమ పార్టీకి భవిష్యత్తు లేదని.. రానున్న

**ఎంపీ రఘురామ ఆసక్తికర వ్యాఖ్యలు**

**సోము వీర్రాజు మాట్లాడింది తప్పేగా**

**అది బ్యాడ్ లక్ అని కామెంట్ చేశారు**

ఎన్నికల్లో కచ్చితంగా తమ పార్టీని ఓడించాలని ప్రజలు కంకణం కట్టుకున్నారన్నారు. అది తమ దురదృష్టం.. తమ పార్టీ దురదృష్టం అన్నారు.రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం, జనసేన పార్టీలతో కలిసి బీజేపీ పోటీ చేస్తుందని మాజీ మంత్రి ఆదినారాయణ రెడ్డి మాట్లాడింది తప్పయితే.. సోము వీర్రాజు మాట్లాడింది కూడా తప్పే అన్నారు. ఎవరి అభిప్రాయాన్ని వారు చెబితే నోటీసులు ఇస్తామని కొందరు నాయకులు పేర్కొన్నారని.. టీడీపీతో కలిసి పోటీ చేసేది లేదని వీరికి ఎవరు చెప్పారన్నారు. ప్రజల కోసం కలిసిన పార్టీలు కొన్నిచోట్ల ఒకరు, మరికొన్ని చోట్ల మరొకరు పోటీ చేస్తే, అన్ని పార్టీల ఓట్లు కలిసిపోతాయన్నారు. ఇటీవల జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లోని ఫలితాలే పునరావృతమవుతాయని.. రానున్న ఎన్నికల్లో రెండవ స్థానంలో తన ప్రస్తుత పార్టీ ఉంటుందన్నారు.కచ్చితంగా ప్రజలను గెలిపించడానికి ప్రతిపక్ష పార్టీలన్నీ ఏకం కావలసిన అవసరం ఉందని అన్నారు. ఇక్కడ పార్టీల గెలుపు ముఖ్యం కాదన్నారు. క్షేత్రస్థాయిలో ఇప్పటికే టీడీపీ, జనసేన కార్యకర్తలు కలిసిపోయారని.. ఇక నాయకులు కలవాల్సిన అవసరం ఉందన్నారు. వ్యక్తిగత ప్రయోజనాల సిద్ధాంతం కోసం కొంత మంది అటు టీడీపీ, ఇటు జనసేన పార్టీలలోనూ పొత్తు వ్యతిరేకించేవారు లేకపోలేదని.. పంచాయితీ ఎన్నికల సందర్భంగా నరసాపురం నియోజకవర్గ పరిధిలో పలుచోట్ల టీడీపీ, జనసేనలు కలిసి పోటీ చేసి విజయం సాధించాయన్నారు. క్యాడర్ ఎప్పుడో కలిస్తే, లీడర్లు ఇప్పుడు కలిశారని అన్నారు.రాష్ట్రంలో తెలుగుదేశం, జనసేన కలిస్తే తమ పార్టీకి బ్యాడ్ టైం స్టార్ట్ అయినట్టే అన్నారు. ఆ రెండు పార్టీలు కలవనున్నాయని.. రాష్ట్రంలో పొత్తుల గురించి సోము వీర్రాజు కాదు ఢిల్లీ పెద్దల మాట చెల్లు బాటు అవుతుందన్నారు. రాష్ట్రంలో గతంలో 50 % ఓటు బ్యాంక్ ఉన్న తమ పార్టీ ఓటు బ్యాంకు ఇప్పుడు గణనీయంగా తగ్గిందని, టీడీపీకి కష్టకాలంలోనూ 40% ఓటు బ్యాంకు ఉండగా.. ఇప్పుడు ఆ పార్టీ ఓటు బ్యాంకు మరింత పెరిగే అవకాశం ఉందని అన్నారు. టీడీపీ ఓటు బ్యాంకుతో పాటు జనసేన, బీజేపీల ఓటు బ్యాంకు కూడా కలిస్తే మంచిదే అన్నారు. ప్రధాన ప్రతిపక్షంతో పాటు రెండవ ప్రతిపక్షం కూడా కలిస్తే ప్రజలకు ప్రయోజనం అన్నారు.చంద్రబాబు, పవన్ కళ్యాణ్ భేటీ కావడాన్ని కొందరు జీర్ణించుకోలేకపోయారన్నారు. గతంలో దమ్ముంటే అందరూ కలిసి రండి అని చెప్పిన సింగల్ సింహం ఎందుకో వణుకుతోందన్నారు. తెలుగుదేశం, జనసేన మధ్య పొత్తు ఉండకూడదని చిచ్చుపెట్టే ప్రయత్నాన్ని చేశారని.. చంద్రబాబు,పవన్ కళ్యాణ్‌లు ప్రజా సమస్యల గురించి చర్చించుకొని.. ప్రజల కోసం కలిసి ముందుకు వెళ్లాలని, ప్రతిపక్షాల ఓట్లు చీలనివ్వకూడదని నిర్ణయించుకున్నారని అన్నారు. మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు కుటుంబాన్ని వ్యక్తిగత కక్షతోనే వేధిస్తున్నారన్నారు. ఆదిరెడ్డి అప్పారావు, ఆయన కుమారుడు వాసులను కుటుంబ సభ్యులు కూడా చూడడానికి అనుమతించలేదని అన్నారు.

# సంపాదకీయం

బుధవారం 03-05-2023

## కశ్మీర్ అయిపోయింది.. ఇక కేరళనా...

ది కేరళ స్టోరీ మూవీపై రచ్చ రగులుతోంది. ది కేరళ స్టోరీ'.. ఇప్పుడొక వివాదాల కేంద్రబిందువు. థియేటర్లలోకి రాకముందే సినీజనాల్ని రెండు వర్గాలుగా విడదీస్తోంది. రాజకీయ నాయకులతో మాటల యుద్ధం చేయిస్తోంది. కొన్నివర్గాల మధ్య నిప్పు రాజేస్తోంది. ఈ చిత్రాన్ని నిషేధించాలని ఒక వర్గం డిమాండ్ చేస్తుంటే.. అలా చేయడం భావ ప్రకటన స్వేచ్ఛ గొంతు నులమడమేనని ఇంకోవర్గం వాదిస్తోంది, మరో మూడు రోజుల్లో రిలీజ్ కానున్నఈ చిత్రంపై కేరళలో విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. సినిమా విడుదలను నిలిపివేయాలని అధికార, ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి.తప్పిపోయిన అమ్మాయిల ఇతివృత్తంతో తెరకెక్కిన ది కేరళ స్టోరీ మూవీపై వివాదం కొనసాగుతోంది. కేరళలో కొన్నేళ్లుగా 32 వేల మంది మహిళలు అదృశ్యమైనట్లు వస్తున్న ఆరోపణలకు సంబంధించి.. వారి ఆచూకీ ఎక్కడనే కథాంశంతో ది కేరళ స్టోరీ సినిమా రూపొందించారు. దీనికి సంబంధించి కొద్దిరోజుల క్రితం ట్రైలర్ రిలీజ్ అయింది. ఓ నలుగురు యువతులు మతం మారి, ఐసిస్‌లో చేరిన నేపథ్యంతో కథ నడుస్తుందని అర్థమవుతోంది. అయితే.. తప్పిపోయిన అమ్మాయిలు మతం మారి, ఉగ్రవాద శిక్షణ పొంది, భారత్‌తోపాటు ప్రపంచవ్యాప్తంగా ఉగ్ర కార్యకలాపాల కోసం పనిచేస్తున్నారనే కోణంలో చూపించడం వివాదానికి దారితీసింది. విడుదలకు సిద్ధమైన ది కేరళ స్టోరీ చిత్రంపై కేరళలో పెద్దయెత్తున విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. మత సామరస్యాన్ని దెబ్బతీసే ఇలాంటి సినిమాను విడుదల చేయొద్దంటూ అధికార, పలు విపక్ష పార్టీలు మండిపడుతున్నాయి. తాజాగా.. ఈ సినిమాపై కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ కూడా ఘాటుగా స్పందించారు. కేరళాను ప్రపంచం ముందు మత తీవ్రవాద కేంద్రంగా చిత్రీకరించేందుకు ప్రయత్నిస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. మతపరమైన విభజన, ద్వేషాన్ని ప్రచారం చేసే ఉద్దేశంతోనే ఈ చిత్రం నిర్మించినట్లు ట్రైలర్ ద్వారా తెలుస్తోందన్నారు. కానీ.. అలాంటి రాజకీయాలు కేరళలో పనిచేయవన్నారు సీఎం విజయన్.మరోవైపు.. ది కేరళ స్టోరీ చిత్రం విడుదలను అధికార పార్టీతోపాటు విపక్ష కాంగ్రెస్ కూడా తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. సమాజంలో విషం చిమ్మేందుకు భావ ప్రకటనా స్వేచ్ఛ ఓ లైసెన్సు కాదంటూ మండిపడ్డాయి. అంతర్జాతీయ స్థాయిలో కేరళను అవమానించే రీతిలో ఈ చిత్రం ఉందని కాంగ్రెస్ ఆరోపిస్తోంది. కేరళలో ఈ సినిమా విడుదలకు అనుమతి ఇవ్వొద్దని డీవైఎఫ్ఐ, ఐయూఎంఎల్ వంటి యువజన సంఘాలు డిమాండ్ చేశాయి. అయితే.. వివాదం చెలరేగడంపై మూవీ డైరెక్టర్ సుదీప్తోసేన్ మరోసారి ట్విట్టర్ వేదికగా రియాక్ట్ అయ్యారు. ఈ సినిమాపై వ్యతిరేకత రానురాను రాజకీయ రంగు పులుముకుంది. అసత్యాలు, అభూతకల్పనలతో నిర్మితమైన ఈ సినిమాపై నిషేధం విధించాలంటూ కొన్ని రాజకీయ పార్టీలు డిమాండ్ చేస్తున్నాయి. 'ఇది ఒక రాజకీయ పార్టీ అనుబంధ మతతత్వ సంస్థ పన్నాగం. కేరళలో మత రాజకీయాల చిచ్చు రగల్చడానికి న్యాయస్థానాలు సైతం తప్పు పట్టిన 'లవ్ జిహాద్'ని ఈ సినిమాతో తెరపైకి తీసుకొచ్చారు. దీన్ని మేం సమ్మతించం' అని కేరళ సీఎం పినరయి విజయన్ స్వయంగా హెచ్చరించడంతో... వివాదానికి మరింత ఆజ్యం పోసినట్టు అయ్యింది. ఇదే రాష్ట్రం నుంచి ఎంపీగా ప్రాతినిధ్యం వహిస్తున్న కాంగ్రెస్ ప్రముఖ నేత శశి థరూర్ సైతం ట్విటర్ వేదికగా 'ఏదైనా తీవ్ర స్వరంతోనే చెబుదాం. ఈ సినిమాని నిషేధించాలని నేను కోరుకోవడం లేదు. భావ స్వేచ్ఛ వర్ధిల్లాలి. కానీ అసత్య ప్రచారాన్ని ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాల్సిందే. ఇది మన కేరళ స్టోరీ కాదని బిగ్గరగా చెప్పాల్సిందే' అని ట్వీట్ చేయడంతో మరింత వేడి రాజుకుంది. ఈ ఇద్దరి నాయకుల ప్రకటనల నేపథ్యంలో.. ఆ రాష్ట్ర భాజపా అధ్యక్షుడు కె.సురేంద్రన్ సోమవారం రంగంలోకి దిగారు. 'కేరళలో ఇస్లామిక్ స్టేట్ (ఐసిస్) ఉగ్రవాద సంస్థ కార్యకలాపాలు ఉన్నాయని ముఖ్యమంత్రికీ తెలుసు. ఆ విషయాన్ని ఆయన ఎప్పుడూ కొట్టిపారేయలేదు. వాస్తవాలు, గణాంకాలేంటో అందుబాటులో ఉన్నాయి. అవన్నీ మర్చిపోయి ఒక సినిమాని ఒక పార్టీకి అనుగుణంగా రూపొందించారని నింద వేయడం తగదు' అని పేర్కొనడంతో ఈ వివాదం తారస్థాయికి చేరింది. మరోవైపు ఈ చిత్రంలో ప్రధాన పాత్ర పోషించిన అదా శర్మ నాకు వందలకొద్దీ బెదిరింపు కాల్స్, ఎసెమ్మెస్‌లు వస్తున్నాయని వాపోయింది. కన్నూర్ అనే ప్రాంతంలో షూటింగ్ చేస్తుండగా మాపై కొందరు దాడికి తెగబడ్డారంటూ దర్శకుడు మీడియాతో చెప్పారు.విడుదలకు ముందే నలువైపులా వివాదాలు చుట్టుముట్టడంతో ఫిల్మ్‌మేకర్లు రంగంలోకి దిగారు. సినిమాని రాజకీయం చేయొద్దంటూ వేడుకుంటున్నారు. 'ఇందులో కల్పితమేమీ లేదు. మా బృందమంతా కలిసి నెలలకొద్దీ పరిశోధన చేసిన తర్వాతే ఈ చిత్రాన్ని పట్టాలెక్కించాం. మొదట్లో ఈ చిత్రం నిర్మించడానికి ఏ నిర్మాతా ఒప్పుకోలేదు. ఆ సమయంలో విపుల్ షా ధైర్యంగా ముందడుగు వేశారు. మా కథ బాధితుల పక్షానే ఉంటుంది తప్ప.. ఇది కేరళ రాష్ట్రానికో, ఏదో ఒక వర్గానికో వ్యతిరేకం కాదు. మేం తీవ్రవాదానికే వ్యతిరేకులం తప్ప ముస్లింలకు కాదు. దీనికి మతం రంగు పులమొద్దు. నిప్పును ఎగదోసినట్టు మాటలతో రాజకీయం చేయకండి. సినిమా చూడకముందే దయచేసి ఒక నిర్ణయానికి రాకండి' అని కోరుతున్నారు దర్శకనిర్మాతలు.ఇప్పుడే మూవీపై ఓ అభిప్రాయానికి రావొద్దని.. సినిమా చూశాక.. ఒకవేళ నచ్చకపోతే అప్పుడు చర్చిద్దామన్నారు. ఇక.. ది కేరళ స్టోరీ మూవీకి విపుల్ అమృత్‌లాల్ షా నిర్మాతగా వ్యవహరించారు. అదా శర్మ ప్రధాన పాత్ర పోషించారు. ఏదేమైనా.. ది కేరళ స్టోరీ మూవీ..ఆ రాష్ట్రంలో తీవ్ర దుమారం రేపుతోంది. మూవీ రిలీజ్‌కు పర్మిషన్ ఇవ్వొద్దని అధికార, ప్రతిపక్షాలు వార్నింగులు ఇస్తున్న నేపథ్యంలో ఏం జరుగుతుందో చూడాలి.

# జేసీ.. ప్రభాకర రెడ్డి మరీనూ...



అనంతపురం,మే 2, రాను రాను తాడిప్రతి మాజీ ఎమ్మెల్యే జేసీ ప్రభాకర్ రెడ్డి ప్రవర్తన శృతి మించుతోందని అయన ప్రత్యర్థుల ఆరోపణ. రాజకీయంగా ప్రత్యర్థుల గురించి విమర్శలు చేయవచ్చు. ఆందోళనలూ చేయవచ్చు. కానీ జేసీ ప్రభాకర్ రెడ్డి స్టయిలే వేరు. భాష మారకపోయినా ఇటీవల కాలంలో వేషం మార్చారు. స్టయిల్‌నూ పూర్తిగా మార్చేశారు. మొన్నా మధ్య లోకేష్ పాదయాత్ర చేస్తూ కాళ్లకు బొబ్బలు లేచాయంటూ పెడ బొబ్బలు పెట్టారు. చూసే వారికి ఏడుస్తున్నట్లు లేదు. నాటకంలాగానే కనిపించింది. ఎందుకింత డ్రామాలు అంటూ సోషల్ మీడియాలో నెటిజెన్లు సైతం వెటకారాలు చేశారు. మూడు రోజుల క్రితం మున్సిపల్ కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగారు. ఇసుక తవ్వకాలు జరిపితే ట్రాక్టర్లను, లారీలను తగులబెడతానని హెచ్చరించారు. మామూలుగా ఇసుక తరలింపునకు వ్యతిరేకంగా ధర్నా చేయవచ్చు. ఆందోళనకు దిగవచ్చు. అందుకు ఎవరూ అభ్యంతరం చెప్పరు. కానీ జేసీ ప్రభాకర్ రెడ్డి మాత్రం తగులబెడతానని హెచ్చరించడంతోనే పోలీసులు ఎంట్రీ ఇచ్చి ఆయనను హౌస్ అరెస్ట్ చేశారు. మున్సిపల్ కార్యాలయం వద్దనే కాలకృత్యాలు చేస్తూ జనం నోటిలో నానేందుకు జేసీ ప్రయత్నించారన్న విమర్శలనూ ఎదుర్కొన్నారు. ఇక తాజాగా జేసీ ప్రభాకర్ రెడ్డి డీజిల్ దొంగ ఎవరు అంటూ ఆందోళనకు దిగారు. తాడిపత్రి ప్రస్తుత ఎమ్మెల్యే పెద్దారెడ్డి ఫ్లెక్సీలను ఏర్పాటు చేసి డీజిల్ దొంగ అంటూ చెప్పే ప్రయత్నం చేశారు. అంతటితో ఆగితే బాగుండేది. అలా ఆగి ఉంటే జేసీ ప్రభాకర్ రెడ్డి ఎలా అవుతారు? అందుకే ఆయన ఓ వైరైటీ నిరసన తెలియజేశారు. తన గుండెల నిండా తాడిపత్రి జనం ఉన్నారని, జనం గుండెల్లో తాను ఉన్నానంటూ జేసీ ప్రభాకర్ రెడ్డి తన గుండెపై పచ్చబొట్టులా పొడిపించుకుని మరీ మీడియా ఎదుట ప్రదర్శనకు దిగారు. ఇది అతి కాక ఇంకేముంటుంది? అన్న కామెంట్స్ వినపడుతున్నాయి. అంతకు ముందు కూడా అప్పటి ప్రతిపక్ష నేతగా ఉన్న జగన్‌ను ఎమ్మెల్యే హోదాలో జేసీ ప్రభాకర్ రెడ్డి తిట్టిన తిట్టు తిట్టకుండా తిట్టారు. రాయలేని భాషలో అనడం తాడిపత్రి వాసులకే కాదు.. రాష్ట్రంలోని ప్రతి ఒక్కరికీ జేసీ అంటేనే ఏవగింపుకలిగేలా చేసుకున్నారు. దాని ఫలితమే తాడిపత్రి నియోజకవర్గంలో పట్టున్న జేసీ కుటుంబం తొలిసారి 2019 ఎన్నికల్లో ఓటమిని చవి చూసింది. అయితే గుడ్డిలో మెల్ల అన్నట్లుగా మున్సిపాలిటీలో గెలిచినా ఆ "వేషాలు" మానుకోలేదు. కంటిన్యూ చేస్తూనే ఉన్నారు. నిజానికి ప్రజల గుండెల్లో ఉంటే జేసీ కుటుంబాన్ని వచ్చే ఎన్నికల్లో ఆటోమేటిక్ గా ప్రజలే గెలిపించుకుంటారు. అంతే తప్ప ఇలాంటి వేషాలు వేయడం వల్ల ఉపయోగం లేదన్న కామెంట్స్ వినపడుతున్నాయ.

# మరో ఎమ్మెల్యేకు పరాభవం

విజయవాడ,మే 2, వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలకు పరాభవం ఎదురైంది. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే కన్నబాబు రాజు, ఎమ్మెల్యే శంకరనారాయణలకు నిరసన సెగలు ఎదురయ్యాయి.గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాలు ఉద్రిక్తంగా మారాయి. యలమంచిలి, పెనుగొండ నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేకు పరాభవం ఎదురైంది.యలమంచిలి నియోజకవర్గంలో ఎమ్మెల్యే కన్నబాబు రాజుకు నిరసన సెగలు ఎదురయ్యాయి. ప్రజలు, సొంత పార్టీ నేతలు అడ్డుకున్నారు.యలమంచిలి నియోజకవర్గం ఎమ్మెల్యే కన్నబాబు రాజును సమస్యలపై స్థానికులు నిలదీశారు. కన్నబాబురాజు పోవాలి.. జగన్ రావాలంటూ నినాదాలు చేశారు. జనం ప్రశ్నిస్తుంటే సహనం కోల్పోయిన కన్నబాబు రాజు వారిపై చేయి చేసుకున్నారు. పూడిమడక గ్రామంలో గడప గడపకూ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యేను ఇళ్ల స్థలాలు తక్షణమే ఇవ్వాలంటూ డిమాండ్ చేస్తూ నిరసన వ్యక్తంచేశారు. జనం గోబ్యాక్ అంటూ నినదించారు.పెనుగొండ ఎమ్మెల్యే శంకరనారాయణ ఈదులపాలపురం వెళ్లగా.. జనం సమస్యల చిట్టా విప్పి నిరసన వ్యక్తంచేశారు. సమస్యలు పరిష్కారం కావడం లేదంటూ ఆగ్రహం వ్యక్తంచేశారు. దీంతో మౌనంగా అక్కడ నుంచి ఎమ్మెల్యే వెళ్లిపోతుండడంతో స్థానికులు ఎమ్మెల్యే కారుపై చెప్పులు విసిరారు.ఎమ్మెల్యేలకు నిరసన సెగ ఎలమంచిలి వైఎస్ఆర్‌సీపీ ఎమ్మెల్యే రమణమూర్తి రాజు సహనం కోల్పోయారు. తన పీఏపైనే దాడి చేశారు. చెంప చెళ్లుమనిపించారు. ఎలమంచిలి ఎమ్మెల్యే కన్నబాబురాజు అచ్యుతాపురం మండలంలోని మత్స్యకార గ్రామం పూడిమడకలో 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. అయితే సొంత పార్టీకే చెందిన మంత్రి అమర్‌నాథ్ వర్గీయులు ఎమ్మెల్యేను అడ్డుకునే ప్రయత్నం చేశారు. ఏపీఐఐసీ పైపులైన్ ప్యాకేజీ ఇప్పించడంతో పాటు గ్రామంలో మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు మత్స్యకార యువతకు ఉపాధి కల్పించాలంటూ ఎమ్మెల్యేను అడ్డుకునే ప్రయత్నం చేస్తూ గోబ్యాక్ నినాదాలు చేశారు. వారిపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో అమర్నాథ్ వర్గీయులు ఎమ్మెల్యేపై దూసుకెళ్లే ప్రయత్నం చేశారు. ఈ సమయంలో ఎమ్మెల్యే పీఏ నవీన్‌వర్మ ఆయన చేయి పట్టుకుని వెనక్కిలాగారు. దీంతో తీవ్ర అసహనానికి గురైన ఎమ్మెల్యే.. పీఏ చెంప చెళ్లుమనిపించారు. దీంతో అందరూ అవాక్కయ్యారు. అయితే ఎమ్మెల్యే ఇలా దురుసుగా వ్యవహరించడం ఇదే మొదటి సారి కాదన్న ఆరోపణలు ఉన్నాయి. కొద్ది రోజుల కిందట తనకు విద్యా దీవెన పథకం మంజూరు కాలేదని తెలిపిన విద్యార్థిపై ఎమ్మెల్యే దురుసుగా ప్రవర్తించారు. చివరికి ఆ విద్యార్థికి క్షమాపణ చెప్పి నిధులు ఇచ్చారు. అలాగే మునగపాక మండలం నాగులాపల్లిలో 'గడప గడపకు' కార్యక్రమంలో తాను ఐటీఐ పూర్తిచేశానని విద్యాదీవెన మంజూరు కాలేదని శంకర్ కుమారుడు శివాజీ ఎమ్మెల్యేకు తెలిపాడు. పాఠశాల యాజమాన్యానికి మంజూరైందని ఎమ్మెల్యే వివరించారు. వాళ్లకు మంజూరైనప్పుడు తనకు చెప్పడమెందుకని యువకుడు ఎదురు ప్రశ్నవేశాడు. దీంతో ఎమ్మెల్యే కన్నబాబు తీవ్రంగా స్పందిస్తూ పథకం మంజూరై కూడా ఎదురు ప్రశ్నవేస్తావా? ఇక్కడి నుంచి వెళ్లు అంటూ ఆ విద్యార్థిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఓట్లకోసం మళ్లీ మా వద్దకు రారా అని శివాజీ ఎదురు సమాధానం చెప్పేసరికి మరింత ఆగ్రహించిన ఎమ్మెల్యే 'ఎవరితో మాట్లాడుతున్నావ్. పళ్లు పీకేస్తా'అంటూ విద్యార్థిపైకి దూసుకువెళ్లారు. ఎలమంచిలి నియోజకవర్గంలో పలు చోట్ల సమస్యల ను పరిష్కరించాలని ప్రజలు నిలదీస్తూండటంతో ఎమ్మెల్యే అసహనానికి గురవుతున్నారు. ఖచ్చితంగా ప్రజల్లోకి వెళ్లాలని సీఎం జగన్ ఆదేశిస్తూండటంతో ఖచ్చితంగా వెళ్తున్నారు. సంక్షేమ పథకాలు ఇస్తున్నామని చెప్పినా చాలా మంది అభివృద్ధి గురించి ప్రశ్నిస్తున్నారు. పథకాలు రాని వాళ్లు పథకాల గురించి ప్రశ్నిస్తున్నారు. దీంతో వైఎస్ఆర్‌సీపీ ఎమ్మెల్యేలకు గడ్డు పరిస్థితులు ఎదురవుతున్నాయి.

# దోస్తీ..దిశగా అడుగులు

విజయవాడ, మే 2, ఏపీ రాజకీయాలు ఆసక్తికరంగా మారుతున్నాయి. ఇటీవల వచ్చిన ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలు... ప్రతిపక్ష టీడీపీ దూకుడు పెంచింది. అధికార వైసీపీపై ఓ రేంజ్ లోనే స్వరం పెంచుతోంది. ఓవైపు లోకేశ్ పాదయాత్రతో ప్రజల్లోకి వెళ్తుంటే... పార్టీ అధినేత చంద్రబాబు కూడా నేతలతో సమీక్షలు చేస్తూ దిశానిర్దేశం చేస్తున్నారు. వచ్చే ఎన్నికల్లో ఎలాగైనా జగన్ ను ఓడించాలన్న కసితో ముందుకెళ్తున్నారు. ఇదే సమయంలో అధికార పార్టీ కూడా వినూత్న కార్యక్రమాలతో ప్రజల్లోకి వెళ్తోంది. మరోసారి జగనన్న ప్రభుత్వమే అంటూ ఆ పార్టీ నేతలు ధీమాగా చెబుతున్నారు. వచ్చే ఏడాది ఎన్నికలు ఉన్న నేపథ్యంలో... ప్రతిపక్ష పార్టీలు పక్కగా పావులు కదిపే పనిలో ఉన్నాయి. ఈ నేపథ్యంలో టీడీపీ అధినేత చంద్రబాబుతో పవన్ కల్యాణ్ మరోసారి భేటీ అయ్యారు. తాజా రాజాకీయ పరిణామాలపై చర్చించారు. వీరిద్దరి భేటీ కాస్త... టాక్ ఆఫ్ ది ఆంధ్రాగా మారింది.ఏపీలో వైసీపీ వ్యతిరేక ఓటు చీలనివ్వబోమని చెబుతున్న పవన్... ఆ దిశగా అడుగులు వేస్తున్నట్లు తెలుస్తోంది. గత కొద్దిరోజులుగా టీడీపీతో పొత్తు పెట్టుకోవడం ఖాయమే అన్నట్లు వార్తలు వచ్చాయి. కానీ అనూహ్యంగా కాస్త సైలెంట్ అయిన పవన్... బీజేపీ నేతలతో సంప్రదింపులు జరిపారు. విశాఖ పర్యటనకు వచ్చిన ప్రధాని మోదీతో కూడా భేటీ అయ్యారు. ఇటీవలే ఢిల్లీ వెళ్లి కూడా బీజేపీ అగ్రనాయకత్వంతో చర్చలు జరిపారు. ఈ పరిణామాలపై పలువురు టీడీపీ నేతలు కీలక వ్యాఖ్యలు చేశారు. జనసేన తమతో కలవకుండా బీజేపీ నేతలు ఒత్తిడి తీసుకుస్తున్నారంటూ మాట్లాడారు. బీజేపీ - వైసీపీ ఒకటే అంటూ విమర్శలు గుప్పించారు. దీనిపై పలువురు బీజేపీ నేతలు స్పందిస్తూ... వచ్చే ఎన్నికల్లో జనసేనతో పొత్తు ఉంటుందని... రాష్ట్రంలో బీజేపీని అధికారంలోకి తీసుకురావటమే తమ లక్ష్యమని చెప్పారు. ఇలా రాజకీయం సాగుతున్న నేపథ్యంలో... టీడీపీ, జనసేన మధ్య పొత్తు ఉండకపోవచ్చన్న అభిప్రాయాలు వ్యక్తమమయ్యాయి. సీన్ కట్ చేస్తే.... జనసేన అధినేత పవన్ కల్యాణ్ హైదరాబాద్ వేదికగా చంద్రబాబుతో భేటీ అయ్యారు. రాష్ట్రంలోని రాజకీయ పరిణామాలపై గంటరన్నపాటు చర్చించారు. ఫలితంగా మరోసారి టీడీపీ - జనసేన పొత్తు అంశం చర్చనీయాంశంగా మారింది.పవన్ - చంద్రబాబు భేటీ కావటం మూడోసారి. 2019 ఎన్నికల తర్వాత మొదటి సమావేశం 2022 అక్టోబరు 18న విజయవాడలో జరిగింది. పవన్ బస చేసిన హోటల్‌కు వెళ్లిన చంద్రబాబు.. ఆయనతో భేటీ అయ్యారు. జగన్ ప్రభుత్వ అరాచకాలపై కలిసి పోరాడాలని నిర్ణయించారు. ఉమ్మడిగా మీడియా సమావేశం నిర్వహించారు. ఆ తర్వాత కుప్పంలో చంద్రబాబు పర్యటనను ప్రభుత్వం, పోలీసులు అడ్డుకోవడంతో... హైదరాబాద్‌లోని ఆయన నివాసానికి వెళ్లి జనసేన అధినేత పవన్ సంఘీభావం తెలిపారు. 2023 జనవరి 8న వారి భేటీ జరిగింది. ప్రభుత్వం ఉమ్మడి పోరాటం దిశగా కార్యాచరణతో ముందుకు వెళ్లాలని ఆ సమావేశంలో నిర్ణయించారు. యర్రగొండపాలెంలో చంద్రబాబును అడ్డుకోవటంపై కూడా పవన్ ఘాటుగా స్పందించారు. తాజాగా హైదరాబాద్ వేదికగా పవన్... మరోసారి చంద్రబాబుని కలవటంతో ఇరు పార్టీల మధ్య పొత్తు కుదిరే అవకాశం ఉందన్న వాదన బలపడుతోంది. వీరి భేటీని బీజేపీ ఎలా చూస్తుందనేది ఆసక్తికరంగా మారింది. ఓవైపు బీజేపీ నేతలతో సంప్రదింపులు జరుపుతున్న పవన్... మరోవైపు చంద్రబాబుతో కూడా మంతనాలు చేస్తున్నారు. ఫలితంగా మూడు పార్టీలు మరోసారి కలిసే అవకాశం ఉంటుందా..? అన్న టాక్ వినిపిస్తోంది. దీనిపై ఇప్పుడిప్పుడే నేతల అభిప్రాయాలు వినిపిస్తున్నాయి.ఇక రాబోయే రోజుల్లో చంద్రబాబు - పవన్ మధ్య మరిన్ని భేటీలు ఉండే అవకాశం ఉందని తెలుస్తోంది. ఈ క్రమంలో పొత్తుపై క్లారిటీ వచ్చే అవకాశం ఉంది

# గోపవరంలో ఉద్రిక్తత

కైకలూరు కైకలూరు మండలం గోపవరం గ్రామంలో పంట భూమి 14 ఎకరాల చేపల చెరువు అక్రమ తవ్వకాన్ని సరిహద్దు రైతులు అడ్డుకున్నారు. వివరాల్లోకి వెళితే గోపవరం గ్రామంలో బడ రైతు మాజీ ఎంపీపీ కోళ్ల అప్పారావు, తనకి ఉన్న 14 ఎకరాలని భూమిని చేపల చెరువుగా తవ్వకాలు ప్రారంభించారు, ఈ విషయం తెలుసుకున్న సరిహద్దు రైతులు, తవ్వకాలు నిలుపుదల చేయాలని అక్కడ ఆందోళన చేశారు, ఈ చెరువు తవ్వకం వల్ల పక్కనున్న మా పంట భూములు దెబ్బతింటాయి, ఇక్కడ వరి పంట భూములు ఎక్కువగా ఉన్న నేపథ్యంలో పంట పండే పరిస్థితి లేకుండా పోతుందని రైతులు ఆవేదన చెందారు, ఈ ప్రాంతంలో ఎక్కువగా సన్న చిన్న కారు రైతులు ఉన్నారు అందరూ పేదవాళ్లే, ఈ చేపల చెరువు తవ్వకం వల్ల నిరుపేద రైతులు కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి ఉన్నది, ఈ నేపథ్యంలో సంబంధిత అధికారులు పరిశీలించి రైతులకు న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు

# రిమ్స్ ఆర్కే నగర్ కాలనీలో కార్డన్ అండ్ సెర్చ్

కడప జిల్లా ఎస్.పి కే.కే.ఎన్ అన్బురాజన్ ఐ.పి.ఎస్ గారి ఆదేశాల మేరకు రిమ్స్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆర్కే నగర్ కాలనీలో పోలీసులు కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. రిమ్స్ సి.ఐ కె.రామచంద్ర, ఎస్.ఐ నారాయణ, సిబ్బంది క్షుణ్ణంగా తనిఖీలు చేసారు. తనిఖీల్లో రికార్డులు లేని 5 ఆటోలు స్వాధీనం చేసుకున్నారు. అనుమానాస్పద వ్యక్తులు తారసపడితే పోలీసులకు సమాచారం అందించాలని స్థానికులకు పోలీసులు సూచించారు. మైదుకూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని నాటుసారా ప్రభావిత ముదిరెడ్డి పల్లి తాండా లో కుడా పోలీసు, స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో అధికారులు, సిబ్బంది జాయింట్ కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. గ్రామంలో అనుమానిత ప్రాంతాల్లో స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో ఇన్స్పెక్టర్ లలితా దేవి, ఎస్.ఐ గణ మద్దిలేటి, సిబ్బంది తనిఖీలు చేసారు. నాటుసారా తయారీకి పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# ఏపీలో అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు

విజయవాడ విదర్భ నుండి ఉత్తర తమిళనాడు వరకు తెలంగాణ,కర్ణాటక మీదుగా కొనసాగుతున్న ద్రోణి ప్రభావంతో రాష్ట్రంలో అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని ఏపీ విపత్తుల సంస్థ వెల్లడించింది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. రైతులు, కూలీలు,గొర్రె కాపరులు జాగ్రత్తగా ఉండాలి. "పిడుగులు" పడే అవకాశం ఉన్నందున చెట్ల కింద ఉండరాదని హెచ్చరించింది.

# పాక హోటల్ లో వెంకయ్య నాయుడు అల్పాహారం

విజయవాడ మంగళవారం ఉదయం విజయవాడ లోని ఎస్ఎస్ఎస్ పాక హోటల్ లో మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు చక్కటి ఇడ్లీని ఆస్వాదించారు. తరువాత అయన మాట్లాడుతూ నోరూరించే వేరుశనగ పచ్చడి, అల్లం పచ్చడి, కారప్పొడి, నెయ్యితో ఈ ఇడ్లీలు నోట్లో వేసుకుంటే కరిగిపోయేలా ఉందని అన్నారు. గుబురు చెట్ల నీడన, సంప్రదాయం ఉట్టిపడే ఈ పాక హోటల్లో ఒకసారైనా ఇడ్లీ రుచి చూడాలి. మంచి రుచికరమైన ఇడ్లీని అందిస్తున్న నిర్వాహకులకు, సిబ్బందికి వెంకయ్య అభినందనలు తెలిపారు. బలవర్ధకమైన మన భారతీయ సంప్రదాయ వంటలను, రుచులను కాపాడుకోవాలని అయన వ్యాఖ్యానించారు.

# కిడ్నీ బాధితులకు ఆర్థిక సహాయం

విజయవాడ ఎన్టీఆర్ జిల్లా ఏ.కొండూరు మండలంలోని 21 గ్రామాల్లో 300 మంది కిడ్నీ బాధితులకు నెల మందులకు ఒక్కొక్కరికి రూ.3 వేలు చొప్పున ఆర్థికసహాయం, పౌష్టికాహారాన్ని కేశినేని ఫౌండేషన్ ద్వారా ఫౌండేషన్ చైర్మన్ టీడీపీ నాయకుడు కేశినేని శివనాథ్(చిన్ని) పంపిణీ చేసారు. కేశినేని చిన్ని మాట్లాడుతూ కేంద్ర మంత్రి ప్రహల్డ్ పటేల్ అమరావతి పర్యటన లో భాగం గా జల్ జీవల్ మిషన్ కింద సిలికాన్ న్ రహిత శుద్ధ జలాల ప్రాజెక్ట్ మంజురుకు సిద్ధంగా వుంది. రాష్ట్ర ప్రభుత్వ వాటా కింద 25 శాతం గ్రాంట్ నిధులు కేటాయించటం లేదని జగన్ ప్రభుత్వం పై విమర్శలు చేసారు. పార్టీలకు అతీతంగా కిడ్నీ వ్యాధి నిర్మూలన చేయాలి. ఏ. కొండూరు మండలం లో కిడ్నీ వ్యాధి పై అధ్యయనం చేయాలని ఐసిఎంఆర్ కు చంద్రబాబు నాయుడు గతంలో లేఖ రాసారు. కిడ్నీ వ్యాధి బాధితుల తో స్వయంగా మాట్లాడి చిన్ని వారి సమస్యలు తెలుసుకున్నారు. టిడిపి అధికారంలోకి రాగానే కిడ్నీ వ్యాధి శాశ్వత పరిష్కారం చేసి ఏ. కొండూరు మండలానికి ఫెర్రీ నుండి కృష్ణ జలాలు అందిస్తాం. ఏ. కొండూరు మండలం లో కిడ్నీ వ్యాధి పై పరిశోధన చేసి వ్యాధి ప్రభలకుండా శ్వాసత పరిష్కారం చేస్తాం. కిడ్నీ వ్యాధి గ్రస్థులకు టిడిపి ప్రభుత్వం ఎల్లవేళలా అండగా ఉంటుందని కేశినేని చిన్ని అన్నారు.ఈ చెక్కుల పంపిణి కార్యక్రమం తిరువూరు నియోజకవర్గ టీడీపీ ఇంచార్జ్ శావల దేవదత్, ఏఎంజీ మాజీ చైర్మన్ అలవాలా రమేష్ రెడ్డి, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గోన్నారు. .

## నేటి నుండి శ్రీ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు

బద్వేలు బద్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని వల్లెలవారిపల్లె గ్రామంలో వలసి ఉన్న స్వయంభు శ్రీ లక్ష్మి నరసింహ స్వామి బ్రహ్మోత్సవాలు బుధవారం నుండి ప్రారంభమైతాయి అందుకు తగిన ఏర్పాట్లు గ్రామ పెద్దలు ఆలయ నిర్వాహకులు చేశారు బుధవారం ఉదయం ఐదు గంటల నుంచి అభిషేకాలు గణపతి హోమం ఉంటాయి నాలుగో తేదీ పూజ కార్యక్రమాలు విగ్రహాల ప్రాణ ప్రతిష్ట ఉత్సవమూర్తుల గ్రామోత్సవం అదే రోజు రాత్రి జబర్దస్త్ టీం రేలా రేలా రేలా ప్రోగ్రాం ఐదో తేదీ గణపతి పూజ స్వామివారి కళ్యాణ మహోత్సవం చాందిని బండ్లు ఉత్సవ విగ్రహాలతో స్వామివారి గ్రామోత్సవం ఆరవ తేదీ బండలాగుడు పోటీలు ఉంటాయి పోటీలలో గెలుపొందిన మొదటి వారికి రూ 50,116 రెండవ బహుమతిగా రూ 40,116మూడో బహుమతిగా రూ 30,116 నాలుగవ బహుమతిగా రూ 10,116 ఉంటాయి పోటీలో పాల్గొన్నఎద్దులకు కన్సోలేషన్ బహుమతులు ఉంటాయి ఏడవ తేదీ పూజా కార్యక్రమాలతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయి బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్న భక్తులకు మూడు రోజులపాటు అన్న ప్రసాదం ఉంటుందని నిర్వాకులు తెలిపారు స్వామి వారి బ్రహ్మోత్సవాల్లో అధిక సంఖ్యలో భక్తులు కుటుంబాలతో సహా పాల్గొనాలని వారు కోరారు

# వైవియూలో ఎన్ ఎస్ ఎస్ పి ఓ ల నియామకం

కడప యోగివేమన విశ్వవిద్యాలయం పోస్ట్ గ్రాడ్యుయేషన్ కళాశాల జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) ప్రోగ్రాం ఆఫీసర్ల నియామకం జరిగింది. నూతనంగా డా. ఎస్వీ వెంకటరమణ ( సహ ఆచార్యులు, జంతు శాస్త్ర శాఖ), డా. ఎం శ్రీధర్ రెడ్డి (సహ ఆచార్యులు, పర్యావరణ శాఖ), డాక్టర్ ఎస్ సునీత ( సహ ఆచార్యులు, అనువర్తిత గణిత శాస్త్ర శాఖ), డా. కె. శ్రీనివాస రావు (సహ ఆచార్యులు, కంప్యూటర్ సైన్స్) లకు నియామకపు పత్రాలను తన చాంబర్లో విశ్వవిద్యాలయ క్యాంపస్ కళాశాల ప్రధానాచార్యులు కె. కృష్ణారెడ్డి అందజేశారు. విశ్వవిద్యాలయ ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త డా.ఎన్. వెంకట్రామిరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆచార్య కృష్ణారెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల్లో సేవా భావాన్ని పెంపొందిస్తూ, ఆదర్శవంతమైన ఎన్ఎస్ఎస్ పిఓలుగా గుర్తింపును పొందాలని ఆకాంక్షించారు. వీరికి కొత్తగా యూనిట్లను కేటాయించారు.

# ప్రెస్టేజియస్ గా... జగనన్నకు చెబుదాం...

కాకినాడ, మే 2,: ఆంధ్రప్రదేశ్‌లో మే 9న జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని ప్రారంభించాలని సీఎం జగన్మోహన్ రెడ్డి నిర్ణయించారు. దీని కోసం 1902 హెల్ప్‌లైన్ నంబర్‌ను వినియోగంలోకి తీసుకు రావాలని నిర్ణయించారు. ప్రతిష్టాత్మకంగా ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నామని, జగనన్నకు చెబుదాం మే 9న ప్రారంభించనున్నట్లు సిఎం ప్రకటించారు. దీనిపై ఇప్పటికే పలుమార్లు సమీక్షలు చేశామని సిఎం పేర్కొన్నారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి తన పేరును కలిపారని, దానిని బట్టే ఈ కార్యక్రమానికి ఇవ్వాల్సిన ప్రాధాన్యత ఎంతో ఇట్టే అర్థం అవుతుందన్నారు. ఇప్పటికే స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, స్పందనకు మరింత మెరుగైన రూపమే జగనన్నకు చెబుదాం అన్నారు. నాణ్యమైన సేవలను ప్రజలకు అందించడమే జగనన్నకు చెబుదాం ఉద్దేశమన్నారు. ఇండివిడ్యువల్ గ్రీవెన్సెస్‌ను అత్యంత నాణ్యంగా పరిష్కరించడమే కార్యక్రమ ఉద్దేశం అన్నారు. హెల్ప్‌లైన్‌కు కాల్ చేసి గ్రీవెన్స్ రిజిస్టర్ చేస్తే, దానిని అత్యంత నాణ్యతతో పరిష్కరించాలని సిఎం సూచించారు. సీఎంఓ, ప్రభుత్వ శాఖల అధిపతులు, జిల్లాలు, డివిజన్ స్థాయిలో, మండల స్థాయిలో మానిటరింగ్ యూనిట్లు ఉంటాయని తెలిపారు. ఈ యూనిట్లను కలెక్టర్లు తప్పనిసరిగా మానిటర్ చేయాలన్నారు. గ్రీవెన్స్ పరిష్కారంలో క్వాలిటీని పెంచడం అన్నది ప్రధాన లక్ష్యం కావాలన్నారు. ప్రాజెక్ట్ మానిటరింగ్ యూనిట్ల ద్వారా పర్యవేక్షణ చేస్తేనే అది సాధ్యపడుతుందని చెప్పారు. ప్రాజెక్ట్ మానిటరింగ్ యూనిట్లను సీఎంఓ కూడా పర్యవేక్షిస్తుందన్నారు. హెల్ప్‌లైన్‌ద్వారా గ్రీవెన్స్ వస్తాయని, వాటిని నిర్దేశిత సమయంలోగా నాణ్యతతో పరిష్కరించాలన్నారు. ఫిర్యాదు ఇచ్చిన వ్యక్తికి సంతృప్తి కలిగించడం అన్నది ముఖ్యమైన విషయం అన్నారు. వ్యక్తిగత ఫిర్యాదులు, కుటుంబం స్థాయిలో వచ్చే ఫిర్యాదులను నమోదు చేసిన తర్వాత వాటిని నిర్ణీత వ్యవధిలో పరిష్కరించాలన్నారు. ప్రభుత్వ సేవలు, పథకాలపై ఎంక్వైరీ చేస్తారని, ముఖ్యమంత్రి సందేశాలను నేరుగా చేరవేయడం అన్నది జగనన్నకు చెబుదాం ప్రధాన లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి నేరుగా ప్రజలతో కనెక్ట్ అయి ఉంటారని, వారి ఫిర్యాదులను నేరుగా తెలియచేయ వచ్చన్నారు. ముఖ్యమంత్రి కార్యాలయం ఫిర్యాదులను నిర్దేశిత సమయంలోగా పరిష్కారం అయ్యేలా చూస్తుందన్నారు. ఐవీఆర్ఎస్, ఎస్ఎంఎస్ ల ద్వారా తాము చెప్పిన సమస్యల పరిష్కారంపై ప్రజలకు రెగ్యులర్ అప్‌డేట్స్ అందుతాయన్నారు. హెల్ప్‌లైన్ ద్వారా సమస్యల పరిష్కారంపై అర్జీదారులనుంచి ఫీడ్ బ్యాక్ కూడా తీసుకుంటుందని, గ్రామ, వార్డు సచివాలయాల్లో వాలంటీర్లు ప్రతి ఇంటినీ సందర్శించి 1902 హెల్ప్‌లైన్ గురించి అవగాహన కల్పిస్తారన్నారు. హెల్ప్‌లైన్‌ను ప్రజలు అంతా వినియోగించుకునేలా వారిని మరింతగా ప్రోత్సహిస్తారని తెలిపారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమం అమల్లో మూడు కీలక యంత్రాంగాల ఉంటాయని, సీఎం కార్యాలయం నుంచి మండల కార్యాలయాల వరకూ ప్రాజెక్ట్ మానిటరింగ్ యూనిట్లు ఉంటాయన్నారు. ప్రతి జిల్లాకు సీనియర్ ఐఏఎస్ అధికారులు ప్రత్యేకాధికారులుగా ఉంటారని తెలిపారు. క్రమం తప్పకుండా ఆయా జిల్లాలను వీరు సందర్శించి పర్యవేక్షిస్తారన్నారు. ప్రతి 15 రోజులకోసారి సంబంధిత జిల్లాలను పర్యవేక్షిస్తారని, కలెక్టర్లతో కలిపి? జగనన్నకు చెబుదాం కార్యక్రమం అమలును పర్యవేక్షిస్తారన్నారు. సమస్యల పరిష్కారాల తీరును రాండమ్‌గా చెక్‌చేస్తారని, ప్రాజెక్ట్ మానిటరింగ్ యూనిట్ల పనితీరును పర్యవేక్షిస్తారన్నారు. ఎక్కడైనా సమస్య పరిష్కారం పట్ల సంతృప్తి లేకపోతే, దాన్ని తిరిగి ఓపెన్ చేస్తారన్నారు. ఎస్ఎంఎస్, ఐవీఆర్ఎస్ ద్వారా వచ్చిన ఫీడ్ బ్యాక్ ఆధారంగా దాన్ని తిరిగి తెరుస్తారని, పరిష్కార తీరుపై పూర్తిస్థాయిలో సమీక్ష చేస్తారన్నారు. చీఫ్ సెక్రటరీ, సీఎంఓ, డీజీపీతో కలిసి రెగ్యులర్‌గా మానిటర్ చేస్తారని, ప్రతి 15 రోజులకోసారి పూర్తిస్థాయిలో సమీక్ష ఉంటుందన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రిగారి పేరు పెట్టారంటే మొత్తం ప్రభుత్వం యంత్రాంగం పేరు పెట్టినట్టేనని సిఎం తెలిపారు. అధికారుల మీద ఆధారపడే ముఖ్యమంత్రి తన విధులను నిర్వహిస్తాడని, అధికారులు అంత్యంత సమర్థవంతంగా విధులు నిర్వహిస్తే? కార్యక్రమం సమర్థవంతంగా సాగుతున్నట్టే లెక్క అని చెప్పారు. ప్రజలకు నాణ్యంగా సేవలను అదించాలన్నదే దీని ఉద్దేశమన్నారు. జగనన్నకు చెబుదాం అమలుకు ప్రతి కలెక్టర్‌కు రూ.3 కోట్ల రూపాయలను తక్షణ నిధులుగా ప్రభుత్వం ఇస్తుందని, అవసరమైన చోట.. ఈ డబ్బును ఖర్చు చేయవచ్చన్నారు. వీటిని ఖర్చు చేసే అధికారం కలెక్టర్‌కు ఇస్తున్నట్లు తెలిపారు. సమస్యల పరిష్కారంలో డెలవరీ మెకానిజం ఉంటుందన్నారు. గ్రామ స్థాయిలోని సచివాలయాలు, ఆర్బీకేలు, అంగన్‌వాడీలు, విలేజ్‌క్లినిక్స్.. అవన్నీకూడా సక్రమంగా పనిచేస్తున్నాయా? లేదా? అన్న అంశంపైన కూడా దృష్టిపెడతారని, ఇవి సక్రమంగా పనిచేస్తే? చాలావరకు సమస్యలు సమసిపోతాయన్నారు.

## నేడు ప్రపంచ పత్రికా స్వేచ్ఛా దినోత్సవం

**-పత్రికారంగంలో శ్రమిస్తున్న మిత్రులందరికీ శుభాకాంక్షలు**




ప్రజాస్వామ్యానికి నాలుగో స్తంభం పత్రికారంగం. ప్రపంచ పత్రికా స్వేచ్ఛా దినోత్సవాన్ని మే 3 వ తేదీన యునెస్కో నిర్వహిస్తుంది. ఆఫ్రికా ఖండంలోని నమిబియా దేశపు విండ హోక్ నగరంలో 1991 ఏప్రిల్ 29 నుండి మే 3 వ తేదీవరకు యునెస్కో నిర్వహించిన సమావేశంలో పత్రికా స్వేచ్ఛకు సంబంధించి పలు తీర్మానాలు చేశారు. స్వేచ్ఛాయుతమైన,స్వాతంత్ర్యమైన, ప్రపంచవ్యాప్తంగా బహుళ జాతుల సమన్వయానికి మాధ్యమంగా, ప్రజాస్వామ్యం వర్ధిల్లడానికి, ఆర్థికాభివృద్ధికీ, పౌరుల ప్రాథమిక హక్కుయైన పత్రికా స్వేచ్ఛ పరిఢవిల్లడం అవసరం. ఐక్యరాజ్య సమితి సర్వసభ్య సమావేశం ప్రపంచ పత్రికా దినోత్సవాన్ని డిసెంబర్ 1993 లో ప్రకటించింది. ఐక్యరాజ్య సమితి 19వ ఆర్టికల్ లోనే పత్రికా స్వేచ్ఛకు సంబంధించిన మూలాలు ఇమిడి ఉన్నాయి. "భావ స్వేచ్ఛ, ప్రకటన, స్వేచ్ఛగా అభిప్రాయాలను కల్గియుండటం ప్రపంచంలోని ప్రతీ పౌరుని ప్రాథమిక హక్కు. ఈ హక్కుల ఇతరుల దయా దాక్షిణ్యాలతో వచ్చినవి కావు. జన్మతో స్వతఃసిద్ధంగా సంక్రమించినవి. (మన రాజ్యాంగంలో కూడా ప్రాథమిక హక్కులను చర్చించింది 19అధికరణంలోనే) రాజకీయాలలోనూ, పరిపాలనలోనూ స్వచ్ఛత విలసిల్లడానికీ, పరుగెత్తేకాలంతో సమాంతరంగా ప్రజల ముంగిటికి వార్తలు అందించే విలేకరులు ప్రతీ దినం ఎన్నో దాడులను, బెదిరింపులను ఎదుర్కొంటున్నారు. కొందరు జైళ్ల పాలవుతున్నారు, మరికొందరు ప్రాణాలు కోల్పోతున్నారు. ఇంకొందరి వివరాలు తెలియకుండ పోతున్నాయి. పత్రికాస్వేచ్ఛా హరణంలో ఇరాక్ ప్రథమ స్థానాన్ని సంపాదిస్తే భారతదేశం 8వ స్థానంలో ఉంది. పత్రికా స్వేచ్ఛ ప్రతీ సమాజానికి, వ్యక్తి జీవనానికి అత్యంత కీలకమైనది. ఆ దేశంలోకానీ, సమాజంలోకానీ పత్రికా స్వేచ్ఛను నియంత్రించడమంటే ఆ సమాజాన్ని అంధకారంలోకి నెట్టివేయడమే. పత్రికా స్వేచ్ఛా పారదర్శకతను తద్వారా సుపరిపాలనను పెంపొందిస్తుంది. పత్రీకా స్వేచ్ఛ అవగాహన, విజ్ఞానాలను అనుసంధానం చేసే వారధి వంటిది. జాతులు, సంస్కృతుల మధ్య భావ మార్పిడికి, వాటి అభివృద్ధికి పత్రికలు, పత్రికా స్వేచ్ఛా తప్పనిసరి. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ప్రమాదపుటంచుల్లో వార్తలు సేకరించే విలేకరులకు (లేదా మరణించిన విలేకరులకు) యునెస్కో/ గ్యూలెర్మో కనో ప్రపంచ పత్రికా స్వేచ్ఛా బహుమతిని ప్రదానం చేస్తారు. కొలంబియాకు చెందిన గ్యూలెర్మో కనో అనే విలేకరి డ్రగ్ మాఫియాను ఎండగడుతూ 1986లో తన పత్రికా కార్యాలయం ఎదుటనే హత్యకు గురయ్యాడు. గ్యూలెర్మో కనో సంస్మరణార్థం ఏర్పాటుచేసిన ఈ బహుమతి విలువ వి2500 0 (అమెరికా డాలర్లు).. ప్రజలకోసం, పత్రికా స్వేచ్ఛాకోసం కృషిచేస్తున్న మన పాత్రికేయ మిత్రులకు శుభాకాంక్షలు తెలుపుతూ, అసువులు బాసిన సంపాద కులకు, విలేకరులకు ఈ రోజున నివాళులర్పించడం మన కనీస ధర్మం.

## ఎంపీగారు...మీరెక్కడా...

చిత్తూరు, మే 2, తిరుపతి లోక్‌సభ స్థానం సగం చిత్తూరు జిల్లాలో, సగం నెల్లూరు జిల్లాలో ఉంది. 2019 ఎన్నికల్లో ఇక్కడ ఎంపీగా గెలిచిన బల్లి దుర్గాప్రసాద్ చనిపోవడంతో ఉప ఎన్నికలో సీఎం వైఎస్ జగన్ వ్యక్తిగత వైద్యుడు డాక్టర్ గురుమూర్తి విజయం సాధించారు. వివాదరహితుడు, సౌమ్యుడు అన్న పేరున్నా.. సమస్యల పరిష్కారంలో మాత్రం వెనుకబడ్డారన్నది లోకల్ టాక్. దానికి తగ్గట్టు ఢిల్లీలో బాగానే కనిపిస్తున్నా ?నియోజకవర్గంలో మాత్రం అందుబాటులో ఉండటం లేదంటున్నారు. ఎంపీతో పనులుంటే ఎవర్ని సంప్రదించాలో కూడా అర్థం కావడం లేదట స్థానికులకు. పార్టీలో ఇంటర్నల్ టాక్ కూడా అదేనటఎంపీ ఇంతవరకు తన పరిధిలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో పర్యటించారా అన్నది కూడా డౌటేనని సొంత పార్టీ నేతలే అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈసారి కూడా గురుమూర్తే తిరుపతి వైసీపీ అభ్యర్థి కావచ్చన్న ప్రచారం ఓవైపు ఉన్నా? ఆయన వ్యవహారశైలి కారణంగా మార్పులకు అవకాశం లేకపోలేదన్న వాదన సైతం వినిపిస్తోంది. మరోవైపు గురుమూర్తి ఈసారి అసెంబ్లీ ఎన్నికల బరిలో ఉంటారనే చర్చ కూడా పార్టీలో జరుగుతోందట. ఆయనకూడా అసెంబ్లీ వైపే చూస్తున్నట్టు చెప్పుకుంటున్నారు. తిరుపతి ఎంపీ పరిధిలో సత్యవేడు, సూళ్లూరుపేట, గూడూరు రిజర్వ్ అసెంబ్లీ సెగ్మెంట్లు ఉన్నాయి. ఈ మూడింటిలో ఎక్కడో ఒక చోటి నుంచి గురుమూర్తి పోటీ చేయాలనుకుంటున్నారట. అందుకే అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో తిరగకుండా వాటిమీదే దృష్టి పెట్టారని చెప్పుకుంటున్నారు. ఎంపీ లెక్కలకు అధిష్టానం ఆలోచనలు సరిపోతాయో లేదో చూడాలి.

## కిడ్నీ రాకెట్..గుట్టు దొరికినట్టేనా

విశాఖపట్టణం, మే 2, సంచల నం సృష్టించిన విశాఖ కిడ్నీ రాకెట్ కేసును ఎట్టకేలకు విశాఖ పోలీసులు ఛేదించారు. కిడ్నీ మార్పిడి కేసులో ఓ డాక్టర్ సూత్రధారిగా వ్యవహరించారు. పేదల ఆర్థిక ఇబ్బందులను ఆసరాగా తీసుకుని దళారుల సాయంతో ఇద్దరు వైద్యులు ఈ కిడ్నీ మార్పిడి ఆపరేషన్లు చేశారు. నార్ల వేంకటేశ్వరరావు అనే డాక్టర్ కీలకంగా వ్యవహరించారు. డాక్టర్ పరమేశ్వర రావుతోపాటు ఐదుగురు దళారులు కామరాజు, శ్రీను, శేఖర్, ఎలీనా, కొండమ్మలను పోలీసులు అరెస్ట్ చేశారు. పెందుర్తి శ్రీ తిరుమల ఆస్పత్రిలోనే బాధితులు వినయ్ కుమార్, వాసుపల్లి శ్రీనివాస్ రావుకు ఆపరేషన్ జరిగింది. ఈ వ్యవహారంలో కీలక సూత్రధారి నార్ల వేంకటేశ్వరరావు గతంలో శ్రద్ధ హాస్పిటల్‌లోనూ అక్రమంగా కిడ్నీ మార్పిడి చేసినట్లుగా పోలీసులు గుర్తించారు. ఈ కేసులో మరింత మందిని అరెస్టు చేసే అవకాశముంది. పెందుర్తి వాంబే కాలనీకి చెందిన జి వినయ్ కుమార్‌కు కిడ్నీ దానం చేస్తే రూ.8.50 లక్షలు ఇస్తామని కొందరు ఆశ చూపారు. దానికి సంబంధించి వినయ్ కుమార్ క్లినికల్ పరీక్షలకు, ట్రాన్స్‌ప్లాంటేషన్ ఆపరేషన్‌కు హాజరయ్యారు. అనంతరం అతనికి రూ.ఐదు లక్షలు ఇచ్చినట్టు చూపించి రూ.2.50 లక్షలు మాత్రమే చెల్లించి మోసం చేశారు. దీంతో బాధితుడు ఏప్రిల్ 26న పెందుర్తి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కారు డ్రైవర్‌గా పని చేస్తున్న వినయ్ కుమార్‌తో వాంబే కాలనీకే చెందిన శ్రీను, అతని భార్య కొండమ్మ, కామరాజు, ఎలీనా పరిచయం పెంచుకున్నారు. వారంతా కిడ్నీ ఇవ్వడానికి ఒప్పించి మహరాణిపేటలో ఉ ంటున్న నార్ల వెంకటేశ్వరరావుకు పరిచయం చేశారు. ఈ క్రమంలోనే విజయ డయాగస్టిక్ సెంటర్‌లో ల్యాబ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న శేఖర్ తప్పుడు పత్రాలు సృష్టించాడు. క్లినికల్ టెస్టులు అక్కడ కొన్ని చేయించాడు. మిగిలిన వాటిని అపోలో ఆస్పత్రిలో చేయించారు. అనంతరం నార్ల వెంకటేశ్వరరావు అనుచరులు రమేష్, పవన్ గతేడాది సెప్టెంబర్, అక్టోబర్ మధ్య కాలంలో పెందుర్తి వద్ద ఉన్న తిరుమల నర్సింగ్ హోమ్‌లోని డాక్టర్ పరమేశ్వరరావును సంప్రదించారు. ఆస్పత్రిలోని రెండో అంతస్తులో ఉన్న ఆపరేషన్ గదిని రూ. 50 వేలకు, వార్డు రూమ్‌ను రూ.10 వేలకు అద్దెకు తీసుకుని అక్కడి సిసి కెమెరాలు పనిచేయకుండా చేశారు. తొలుత పరీక్షల అనంతరం కిడ్నీ ఇచ్చేందుకు విముఖత చూపుతూ హైదరాబాద్ వెళ్లిపోగా అతన్ని బెదిరించి బలవంతంగా విశాఖకు రప్పించారు. కిడ్నీ మార్పిడి ఆపరేషన్ చేశారు. విశాఖలో వెలుగు చూసిన ఈ వ్యవహారం పోలీసులు ఛేధించినట్లుగా చెబుతున్నంత చిన్నది కాదని చాలా పెద్ద రాకెట్ ఉందన్న ఆరోపణలు వస్తున్నాయి. ఒకరిద్దర్ని అరెస్ట్ చేసి పోలీసులు కేసును పూర్తి చేశామంటున్నారు కానీ.. అసలు ఎంత మంది ఇలా బాధితులయ్యారన్న విషయాన్ని.. అసలు ముఠాను పట్టుకోలేదన్న విమర్శలు ఎక్కువగా వినిపిస్తున్నాయి.

## వందలాది కంపెనీలను తీసుకువచ్చి ఉపాధిని కల్పిస్తాను

**విశాఖలో కేఏపాల్ ప్రకటన**

విశాఖపట్నం విశాఖలోని స్టీల్ ప్లాంట్ జోలికి ఎవరొచ్చినా తగిన మూల్యం చెల్లించుకొక తప్పదని ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ అన్నారు.ఆ ప్లాం ట్ కు ఉన్న 20 వేల ఎకరాల భూమిలో ని 10 వేల ఎకరాల్లో తాను వందలాది కంపెనీలను తీసుకువస్తానని కేఏ పాల్ అన్నారు.దాదాపు 10 లక్షల ఉద్యోగాలిస్తామని చెప్పా రు. విశాఖ స్టీల్ ప్లాంట్ ను ప్రైవేటీకరించవద్దని పోరాడు తున్న వారిలో 27 మంది కార్మికులను కలిశా నని కేఏ పాల్ అన్నారు.ఎట్టిపరిస్థితు ల్లోనూ ప్రైవేటీకరణ జరగ దని తెలిపారు. దాని అమ్మకానికి ప్రధాని మోదీ నిర్ణయా లు తీసుకుంటున్నారని, ఇక్కడ 20 వేల ఎకరాలతో రియల్ ఎస్టేట్ వ్యా పారం చేయాలని అనుకుంటున్నా రని అన్నారు.పార్టీలకు అతీతంగా పోరా టం చేస్తానని చెప్పారు.?

## క్యాలిఫైడ్ టీచర్ల అందోళన

గుంటూరు జిల్లా విద్యా శాఖ అధికారి కార్యాలయం వద్ద 1998 క్వాలిఫైడ్ టీచర్ల ధర్నా కొనసాగుతోంది. అర్హులందరికీ ఉద్యోగాలు ఇవ్వాలంటూ వారంతా గుంటూరులో ఆందోళనలు కొనసాగిస్తునే ఉన్నారు. ఇప్పటికే కొంతమందికి ఉపాధ్యాయులుగా పోస్టింగ్స్ ఇవ్వగా మిగిలిన అర్హులైన వారందరికీ ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. మంగళవారం డీఈవో కార్యాలయం వద్ద 98 క్వాలిఫైడ్ టీచర్లు ధర్నా చేపట్టి నిరసన వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 5800 మంది అర్హత సాధించగా కేవలం 4వేల మందికి మాత్రమే ఉద్యోగాలు ఇచ్చారని ఆరోపించారు.

## అదిరెడ్డి కుటుంబం పై కక్ష్య సాధింపు

**విశాఖలో టిడిపి నేతల ఆగ్రహం**

విశాఖపట్నం అదిరెడ్డి కుటుంబం పై కక్ష్య సాధింపుగా ముందుకు వెళ్తున్నా రని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహమ్మద్ నజీర్ అన్నారు.అదిరెడ్డి భవాని ఎమ్మెల్యే గా గెలిచారని,రాజ మండ్రి లో ఎమ్మెల్యే గా మంచి పేరు ఉందని అన్నారు.వారి పై అక్రమ కేసు లు సీఐడీ పోలీసులు అరెస్ట్ చేశారని, జగన్మోహన్ రెడ్డి నిరంకుశ పాలన నశిం చాలని చెప్పారు.రాబోయే రోజుల్లో వైసీపీ ప్రభుత్వానికి ప్రజలే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు.రాష్ట్ర పార్టీ కార్యదర్శి బండారు అప్పలనాయుడు మాట్లా డుతూ ... టీడీపీ ఏ కార్యక్రమం చేసిన వైసీపీ ఇబ్బంది పెడుతుందని, అదిరెడ్డి కుటుంబాన్ని ఇబ్బందులు పెట్టడానికి చూస్తున్నారని ధ్వజమెత్తా రు.సీఐడీ కక్ష్య సాధింపుగా వెళ్తుందని అన్నారు.

## వైభవంగా అన్నవరం కళ్యాణ మహో త్సవం

అన్నవరం ప్రముఖ పుణ్యక్షేత్రం అన్నవరం శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామి వారి దివ్య కళ్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది మందుగా స్వామి అమ్మవార్లను కొండ క్రింద గ్రామోత్సవం నిర్వహించారు అనంతరం స్వామి అమ్మవార్లను కళ్యాణ వేదిక వద్దకు అత్యంత బాజా బజింత్రీల నడుమ తీసుకువచ్చారు స్వామి అమ్మవారికి దేవాదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ ప్రభుత్వం తరుపున పట్టు వస్త్రాలు సమర్పించార

## తిరుమలలో హై అలెర్ట్...

తిరుపతి, మే 2,కలియుగదైవం కొలువైన తిరుమలలో ఉగ్రవాదులు చొరబడ్డారంటూ పోలీసులకు సమాచారం రావడం కలకలం రేపింది. ఓ గుర్తు తెలియని వ్యక్తి ఉగ్రవాదులు తిరుపతిలో సంచరిస్తున్నారని పోలీసులకు, టీటీడీకి మెయిల్ చేశాడు. ఆ వ్యక్తి మెయిల్ తో తిరుపతి అర్బన్ పోలీసులు అప్రమత్తం అయ్యారు. పోలీస్ అధికారులు తిరుమల ఆలయంలో ప్రవేశించే అవకాశం ఉందని అనుమానించి.. టీటీడీ భద్రతాధికారులని అప్రమత్తం చేశారు. దాంతో తిరుమలలోభద్రతాధికారులు హై అలర్ట్ ప్రకటించారు.గత కొద్దీ రోజులుగా సులభ కార్మికుల సమ్మె కారణంగా పారిశుధ్య కార్మికుల రూపంలో ఉగ్రవాదులు తిరుమలకీ వచ్చారన్న కోణంలో పోలీసులు విచారణ చేపట్టారు. తిరుమలలోని అన్ని ప్రాంతాలోని సిసి కెమెరా పుటేజీని పోలీసులు, భద్రతా సిబ్బంది పరిశీలించారు. బస్సులు, జన సంచారం, రద్దీ ఉన్న ప్రాంతాల్లో ముమ్మర తనిఖీలు చేపట్టారు. అనుమానిత వ్యక్తులు కనిపిస్తే తమకు సమాచారం ఇవ్వాలని భక్తులకు, స్థానికులకు పోలీసులు సూచించారు. అయితే ఉగ్రవాదుల చొరబాటుని పోలీస్ యంత్రాంగం అధికారికంగా దృవీకరించలేదు. తిరుమలలో భక్త సంచారం వుండే ప్రదేశాల్లో తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు..తిరుమలలో ఉగ్రవాదుల చొరబాటు ప్రచారంపై తిరుపతి ఎస్పీ పరమేశ్వర్ రెడ్డి స్పందించారు. తిరుమలలో ఉగ్రవాదులు ఉన్నట్లు పోలీసులకు సమాచారం అందినట్లు చెప్పారు. గుర్తు తెలియని వ్యక్తి నుంచి పోలీసులకు మెయిల్ వచ్చిందని తెలిపారు. పోలీసులు, భద్రతా సిబ్బంది అప్రమత్తమై తనిఖీలు చేశామని, చివరికి అది ఫేక్ మెయిల్ అని తేలినట్లు వెల్లడించారు. భక్తులు ఇలాంటి అసత్య ప్రచారాలు నమ్మకండి. తిరుమలలో ఎలాంటి ఉగ్రవాద కదలికలు లేవు. తిరుమలలో భద్రత పటిష్ఠం గా ఉందన్నారు. తిరుమల కొండపై శ్రీవారి ఆలయానికి కూత వేటు దూరంలో కత్తులతో దాడి జరగడం తీవ్ర కలకలం రేపుతుంది. శ్రీవారి ఆలయానికి కూతవేటు దూరంలోని హెచ్.టి కాంప్లెక్స్ వద్ద భక్తులు చూస్తుండగానే, సినిమాలోని ఘటనని తలపించే విదంగా కొందరు వ్యక్తులు నడి రోడ్డుపై కత్తులతో వీరంగం సృష్టించారు. గతంలో అనేక కేసుల్లో నిందితుడిగా ఉన్న పాత నేరస్థుడైన సతీష్ తో సహా ఏడుగురు వ్యక్తులు పద్మనాభం అన్నే వ్యక్తి పై కత్తులతో దాడి చేయగా, వీరి నుంచి తప్పించుకున్నే క్రమంలో పద్మనాభం భయపడి పోలీస్ కాంప్లెక్స్ లోకి పరుగులు తీశాడు.సతీష్ బ్యాచ్ చేసిన ఈ కత్తి దాడిలో బాధితుడు పద్మనాభం చేతి, వీపుపై తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు అతని అశ్విని ఆస్పత్రికి తరలించారు. పోలీస్ స్టేషన్ కి కూత వేటు దూరంలోనే ఈ ఘటన చోటు చేసుకుంది. ఇంత జరుగుతున్న పోలీసులు పట్టించుకపోక పోవడంతో దాడి చేసిన నిందితులు పరారయ్యారని స్థానికులు చెబుతున్నారు. దాడి ఘటనని సీసీటీవీ ఫుటేజ్ ద్వారా పరిశీలించిన పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. హిందువుల పరమ పవిత్ర పుణ్యక్షేత్రమైన తిరుమల కొండపై శ్రీవారి ఆలయానికి అత్యంత సమిపంలో పోలీస్ స్టేషన్ కి కూత వేటు దూరంలో ఒకరిపై కత్తులతో దాడి ఘటన జరగడం తిరుమల భద్రతలోని డొల్లతనాని బట్టబయలు చేసింది. ఈ ఘటనని చూసిన భక్తులు ఎప్పుడు, ఎక్కడ నుంచి ఎవరైనా దాడి చేస్తే రక్షణ ఉంటుందా లేదా అని తిరుమలలో హాట్ టాపిక్ అవుతోంది


## కోటప్పకొండలో వివాదం

**ఈవోపై ఆరోపణలతో పూజారుల ఫిర్యాదు**

గుంటూరు కోటప్పకొండ ఆలయ ఈవో పై ఆలయ పూజారులు, సిబ్బంది తిరుగుబాటుబావుట ఎగురవేసారు. ఈవో తమకు నిత్య కైంకర్యాలకు సహకరించడం లేదని వారు ఆరోపించారు. అయినా దానికి, కాని దానికి భక్తుల ముందు పూజారులను, సిబ్బందిని గౌరవం లేకుండా తీవ్రమైన పరుష పదజాలంతో దుర్భాషలాడుతున్నారని, తమ మనోభావాలకు ఇబ్బందిగా ఉందని ఉన్నతాధికారులకు పూజారులు లేఖలో విన్నవించారు. మే 4వ తేదీ నుంచి కొండ కింద భాగంలో స్వామివారికి కొండపైన స్వామివారికి నిత్య కైంకర్యాల విధులను బహిష్కరిస్తున్నట్లు లేఖలో పేర్కొన్నారు. నిస్సహాయులుగా ఉన్న తాము చూసిచూడనట్లు భరిస్తున్నామని, రోజూ మనోవేదన ను భరించలేకపోతున్నామని తెలిపారు. స్వామివారి కైంకర్యాలకు స్వామివారి ధనమునకు భద్రత లేకుండా పోవడంతో తమ మనసులో అశాంతి నెలకొని ఉండి, అభద్రతాభావంతో ఉన్నామని పేర్కొన్నారు. ఆగమ సాంప్రదాయానికి విరుద్ధంగా తమ చేత స్వామి కార్యక్రమాల విషయంలో మమ్ములను భయపెట్టి బెదిరించి కార్యక్రమాలు నిర్వహించేలా చేస్తున్నారని పూజారులు పేర్కొన్నారు.ఆలయ ప్రధాన అర్చకులు కొండ కావూరి వెంకటప్పయ్య గురుకుల్, రంగావజ్జుల కిరణ్ కిషోర్ శర్మ ఫణీంద్ర దుర్గా, రామకృష్ణ వేదవ్యాస్ కే సత్యం కెవి సుబ్రహ్మణ్యం ఆలయ సిబ్బంది కొండయ్య నాగిరెడ్డి శ్రీనివాసరావు తదితరులు లేఖపై సంతకం చేసారు.

## రజనీని టార్గెట్ చేసిన రోజా...

తిరుపతి, మే 2, ఎన్టీఆర్ శతజయంతి ఉత్సవాల్లో ముఖ్య అతిథిగా విచ్చేసిన రజనీకాంత్ టిడిపి అధినేత చంద్రబాబుపై ప్రశంసలు కురిపించటం రాజకీయ ప్రకంపనలు దారి తీసింది. ఐతే ఇది అధికార వైసిపికి ఏమాత్రం మింగుడుపడటంలేదట. చంద్రబాబు లాంటి వెన్నుపోటు దారుడికి మద్దతుగా మాట్లాడుతారా?అంటూ మంత్రి రోజా, కొడాలి నాని, అంబటి, ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి లాంటి నేతలు ఓరెంజ్‌లో రజనీకాంత్‌పై ఫైర్ అయ్యారు. తీవ్ర స్థాయిలో తిట్లతో విరుచుకుపడ్డారు. ఇక సోషల్ మీడియాలోనూ రజనీకాంత్‌కు వ్యతిరేకంగా వైసిపి శ్రేణులు పోస్టుల పెడుతున్నారు. రజనీకాంత్‌పై చేసిన మాటల దాడులను ఏపీలోని చాలా జిల్లాల్లో ఎవరూ పట్టించుకోకుండానే ఉన్నారు. కాని చిత్తూరు జిల్లా వైసిపిలో మాత్రం ఇది హాట్ టాపిక్‌గా మారింది. పార్టీ కేడర్‌తో పాటు జిల్లా పొలిటికల్ సర్కిల్స్‌లోనూ ఇప్పుడు ఇదే చర్చగా మారింది. రజనీకాంత్‌పై చేసిన విమర్శలు పార్టీపై ఎక్కడ ప్రభావం చూపుతాయోననే భయం పట్టుకుందట జిల్లా నేతలకు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా జిల్లాలో తమిళ ఓటర్లు ఎక్కువగా ఉండటమే ఇందుకు కారణంగా చెబుతున్నారు నేతలు. ఉమ్మడి చిత్తూరు జిల్లాది రాష్ట్ర రాజకీయాల్లోనే కీలక పాత్ర. ఈ జిల్లా నుంచి చంద్రబాబు, కిరణ్ కుమార్ రెడ్డి ఇద్దరు సిఎంగా పనిచేశారు. ఎప్పుడూ రాష్ట్ర రాజకీయాల్లో సెంటర్ ఆఫ్ అట్రాక్షన్‌గా ఉంటుంది. చంద్రబాబు,పెద్దిరెడ్డి, రోజా, చెవిరెడ్డి, భూమన



లాంటి నేతలు ఈ జిల్లా వారే. అయితే వీరందరిని అసెంబ్లీకి పంపటంలో తెలుగు ఓటర్లతో పాటు తమిళ ఓటర్ల పాత్ర అత్యంత కీలకం. ఉమ్మడి జిల్లాలోని 14 నియోజకవర్గాల్లో సగానికిపైగా తమిళ ఓటర్లదే హవా. ఎన్నికలప్పుడు తమిళ ఓటర్ల ప్రభావం ఎక్కువగా ఉంటుంది. నగరి, చిత్తూరు,కుప్పం,పలమనేరు, సత్యవేడు, శ్రీకాళహస్తి, తిరుపతిలో తమిళ ఓటర్లు ప్రభావం ఉంటుంది. నగరి,చిత్తూరు నియోజకవర్గంలో రెండు లక్షల మంది ఓటర్లు ఉంటే వారిలో సగంమంది వరకు తమిళ ఓటర్లే ఉంటారు. గతంలో ఇక్కడ తమిళ పార్టీలైనా ఎఐడిఎంకె, డిఎమ్‌కె ఎన్నికల్లో పోటి చేశాయి.మంత్రి రోజా సొంత నియోజకవర్గమైన నగరిలో ఇదే చర్చగా మారిందట. అక్కడ రజనీకాంత్‌కు విపరీతమైన ఫ్యాన్ ఫాలోయింగ్ ఉంది. అలాంటి చోట నుంచి గెలిచిన రోజా ఎందుకు రజనీకాంత్‌ను టార్గెట్‌గా చేశారనే చర్చ జోరుగా సాగుతోంది. గత రెండు ఎన్నికల్లోనూ తమిళ ఓటర్ల మద్దతుతునే స్వల్ప మెజారిటీతో గెలిచారు రోజా. అలాంటి ఓటర్లను దృష్టిలో పెట్టుకోకుండా విమర్శలు దాడి చేయడం నగరి పార్టీలో చర్చగా మారిందని టాక్. అలా మాట్లాడకుండా ఉంటే బాగుండేదని సొంత పార్టీ నేతలే బహిరంగంగా చర్చించుకున్నారట. రోజా సైతం అక్కడ తమిళ ఓటర్లతో తమిళంలోను మాట్లాడుతూ దగ్గర అయ్యారు. రోజా భర్త సెల్వమణి తమిళ వ్యక్తే. ఆయన తమిళనాడు డైరెక్టర్ల అసోసియేషన్ సెక్రటెరీగా ఉన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో అనవసరంగా రోజా రజనీకాంత్‌పై విమర్శలు చేశారంటున్నారు పార్టీ నేతలు. నియోజకవర్గంలో రజనీకాంత్ ఎఫెక్ట్ ఎక్కువగా ఉందని తెలిసినా?ఎందుకు మాట్లాడారు?ఇప్పుడు తమిళ ఓటర్లను మచ్చిక చేసుకోవటం ఎలా అని తలలు పట్టుకుంటూన్నారట లోకల్ వైసిపి కేడర్. రోజా వ్యతిరేక వర్గం సైతం ఈ విషయంపై సీరియస్‌గానే ఉందని టాక్.రోజాతో పాటు బియ్యపు మధుసుధన్ రెడ్డి సైతం రజనీకాంత్‌పై ఓ రేంజ్‌లో రెచ్చిపోయారు.

# రూ 6 కోట్ల 23 లక్షల ఆస్తి పన్ను వసూలు



నంద్యాల మా ప్రతినిధి మే 2. విభారె న్యూస్ :- నంద్యాల పురపాలక సంఘము 2023-2024 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి, ఏప్రిల్ నెలాఖరు వరకు 6-కోట్ల 23 లక్షలు మేర ఆస్తి పన్నును ప్రజలు చెల్లించినట్లు పురపాలక రెవెన్యూ అధికారి వర ప్రసాద్ తెలిపారు. ఏడాదికి చెందిన ఆస్తి పన్ను, ఖాళీ స్థలాలపై పన్ను ఒకే సారి చెల్లించిన వారికి, 5 శాతం మేర కల్పించిన రాయితీని వినియోగించు కొని ప్రజలు భారిగా పన్ను చెల్లించారని పేర్కొన్నారు.

# కర్నూల్ జిల్లా పరిషత్ కార్యాలయంలో జరిగిన డి.ఆర్.సి సమావేశం లో పాల్గొన్న మంత్రివర్యులు, ఎమ్మెల్యేలు, అధికారులు

కర్నూలు మా ప్రతినిధి మే 2 విభారె న్యూస్ :- మంగళవారం సమావేశానికి విచ్చేసిన రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి గారికి మరియు కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం గారికి ఎమ్మిగనూరు ఎమ్మెల్యే "ఎర్రకోట చెన్నకేశవరెడ్డి"పూల పుష్పగుచ్ఛాన్ని అందజేసి స్వాగతం పలికారు. ఈరోజు కర్నూల్ నగరం లో ఉన్న జిల్లా పరిషత్ కార్యాలయం లో జిల్లా రివ్యూ కమిటీ సమావేశంలో ఎమ్మిగనూరు ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవరెడ్డి" పాల్గొన్ని నియోజకవర్గంలో ఉన్న సమస్యలను రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి గారికీ, కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం గారికీ, మరియు జిల్లా అధికారులకు తెలియజేశారు. రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి మరియు జిల్లా కలెక్టర్ సనుకులంగా స్పందించి నియోజకవర్గంలో చేయాల్సిన పనులను త్వరలో పూర్తి చేస్తామని చెప్పడం జరిగింది. ఈ సమావేశం లో రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి , కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం, కర్నూల్ జిల్లా ఎమ్మెల్యేలు యం.ఎ హాఫిజ్ ఖాన్ , కాటసాని రాంభూపాల్ రెడ్డి డాక్టర్ సుధాకర్, శ్రీదేవి ఎమ్మెల్సీ, కలెక్టర్ డాక్టర్ జీ. సృజన ఐఏఎస్ జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య కమిషనర్ భార్గవ తేజ పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.








# గిరిజనుల ఉద్యమానికి కర పత్రాలు విడుదల




## గిరిజన సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు రాజు నాయక్

నంద్యాల మా ప్రతినిధి మే 2 విభారె న్యూస్ :-ఈనెల 14న గిరిజనుల చలో విజయవాడ కరపత్రాలను విడుదల చేసిన జిపిఎస్ నాయకులు. రాష్ట్రస్థాయి గిరిజన మేధావుల సదస్సును జయప్రదం చేయండి. వెనుకబడిన వర్గాల గిరిజనులకు ఆదుకోవాల్సిన ప్రభుత్వాలు ఇతర కులాలను ఎస్టీ జాబితాలో చేరుస్తున్నామని తీర్మానం చేయడం అణగారిన వర్గాల బతుకులతో ఆడుకోవడం సరికాదని గిరిజన ప్రజా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు రాజు నాయక్ అన్నారు. మంగళవారం నంద్యాల పట్టణంలోని స్థానిక జిపిఎస్ కార్యాలయంలో రాష్ట్ర సహాయ కార్యదర్శి రవి నాయక్ అధ్యక్షతన ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. రాష్ట్ర అధ్యక్షుడు రాజు నాయక్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి గిరిజన మేధావుల సదస్సు చలో విజయవాడ కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా రాజు నాయక్ మాట్లాడుతూ75 సంవత్సరాల స్వతంత్ర భారతదేశంలో ఇంకా అభివృద్ధికి ఆమడ దూరంలో నివసిస్తున్న గిరిజనులపై మరో వ్యక్తులను తీసుకొచ్చి ఏకంగా అసెంబ్లీలో తీర్మానం చేయడం సరికాదన్నారు. ఎస్టిలో ఇతరులను చేర్చితే రాజకీయ, సామాజిక, ఆర్థికంగా వెనుకబడిన గిరిజనులు వారి చేతిలో చితికిపోవడం ఖాయమన్నారు. మరో మారు బ్రిటిష్ పాలనాల అణగారిన వర్గాలపై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వివక్ష చూపుతున్నారన్నారు. అనాదిగా వస్తున్న సంస్కృతి సాంప్రదాయాలు, కులవృత్తుల, వేష భాష, కలిగిన గిరిజనులలో ఇతర కులాలను చేర్చడం సరికాదన్నారు. అందరూ కలిసికట్టుగా సంఘటితమై ఈనెల14వ తేదీన విజయవాడ మహానగరంలో జరిగే రాష్ట్రస్థాయి గిరిజన మేధావుల సదస్సును జయప్రదం చేసి విజయవంతం చేయాలని గిరిజనులకు పిలుపునిచ్చారు. పార్టీలకు, సంఘాలకు, రాజకీయాలకు, అతీతంగా జరిగే ఈ సదస్సును మేధావులు, ఉద్యోగులు, యువకులు, మహిళలు, డాక్టర్లు, టీచర్లు ప్రతి ఒక్కరు పాల్గొని వారి అభిప్రాయాలను వ్యక్తపరచాలని తెలియజేశారు. ఈ సమావేశంలో జిపిఎస్ మహిళా అధ్యక్షురాలు ఉషారాణి, ఉద్యోగుల సంఘం నాయకులు బద్దు నాయక్, టీచర్ మత్రు నాయక్, ఏబి తాండ దేవా నాయక్, కోత్తరామాపురం నాగ స్వామి నాయక్, ఎస్ ఎన్ తండా రాము నాయక్, కటారి నాయక్, కే రంగస్వామి నాయక్, రుద్రవరం వెంకటేశ్వర నాయక్, అంకారావు, విక్రమ్ నాయక్, స్వామి నాయక్, మరియు తదితరులు పాల్గొన్నారు.

# చెంచు గూడెంలలో ప్రాథమిక సౌకర్యాలపై బాధ్యత తీసుకోండి

## దత్తత అధికారులను ఆదేశించిన జిల్లా కలెక్టర్ డా. మనజీర్ జిలాని సామూన్



నంద్యాల మా ప్రతినిధి మే 2 విభారె న్యూస్ :-జిల్లాలోని 42 చెంచు గూడెంలకు నియమించిన దత్తత అధికారులు తనిఖీలు నిర్వహించి గుర్తించిన ప్రాథమిక సౌకర్యాల కల్పనకు సంబందిత అధికారులు, చెంచు గూడెంల దత్తత అధికారులు బాధ్యత తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డా. మనజిర్ జిలాని సమూన్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో చెంచు గూడెం లలో కనీస వసతి సదుపాయాల కల్పనపై సంబంధిత అధికారులు, దత్తత అధికారులతో కన్వర్జెన్సీ సమావేశం నిర్వహించారు. ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి రవీంద్రనాథ్ రెడ్డి, ఎపిడి మురళి తదితర అధికారులు పాల్గొన్నారు.. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డా. మనజీర్ జిలాని సామూన్ మాట్లాడుతూ జిల్లాలోని 14 మండలాల్లోని 42 చెంచు గూడెంలలో దత్తత అధికారులు గుర్తించిన త్రాగునీరు, విద్యుత్తు, టాయిలెట్లు, సిసి రోడ్లు, డ్రైనేజీ కాలువలు తదితర ప్రాథమిక మౌలిక వసతులు కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. చిన్న కొట్టాల చెరువు, బైర్లూటీ, నారపురెడ్డి కుంట, మాడుగుల, గాజులపల్లి మెట్ట తదితర 9 చెంచు గూడెంలలో త్రాగునీటికి సంబంధించి బోర్ల మరమ్మతులు, డిస్ట్రిబ్యూషన్ లైన్ పనులు, ఆర్వో ప్లాంట్, సోలార్ కనెక్షన్, విద్యుత్ స్తంభాలు, వీధి దీపాలు తదితర పనులకు యంపి ల్యాడ్స్ కింద రు.40 లక్షలు మంజూరుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సిపిఓ వేణుగోపాల్ ను కలెక్టర్ ఆదేశించారు. స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ కింద చెంచుగూడెంలలో మరుగుదొడ్ల నిర్మాణాలకు ప్రతిపాదనలు సమర్పించాలని ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈ మనోహర్ ను ఆదేశించారు. వెలుగోడు చెంచు కాలనీలో ఐటీడీఏ కార్పొరేషన్ నుండి కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ప్రాజెక్ట్ అధికారిని కలెక్టర్ ఆదేశించారు. చెంచు గూడెంలలో మంజూరైన 2170 గృహాలలో నిర్మాణాలకు అనువుగా ఉన్న 651 ఇళ్లను వారం రోజుల్లో గ్రౌండింగ్ చేయాలని కలెక్టర్ హౌసింగ్ అధికారులను ఆదేశించారు. 16 గిరిజన ప్రాంతాల్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో 9.8 లక్షల రూపాయలతో ఆరు బెడ్ల షెడ్లను ఏర్పాటు చేస్తున్నట్లు కలెక్టర్ వివరించారు. ఎదురుపాడు, 80బన్నూరు గ్రామాలలో 24 వ్యవసాయ బోర్లకు ప్రతిపాదనలు తయారు చేయాలని డ్వామా పిడిని ఆదేశించారు. జానాల గూడెం, మాడుగుల, ఎర్రమటం గూడెంలలో సోలార్ కనెక్షన్ల ఏర్పాటుకు తనిఖీ చేసి వారం రోజుల్లో నివేదిక సమర్పించాలని నెడ్ క్యాప్ అధికారిని కలెక్టర్ ఆదేశించారు. చెంచు గూడెంలలో గుర్తించిన 88 రేషన్ కార్డులకు గాను కేవలం 4 కార్డులు మాత్రమే పూర్తి కావడంపై సివిల్ సప్లైస్ అధికారిపై కలెక్టర్ అసహనం వ్యక్తం చేస్తూ వారం రోజుల్లో పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. రేషన్ కార్డుల జారీకి నిర్లక్ష్యం వహించిన అధికారికి షోకాజ్ నోటీసు జారీ చేయాలని ఐటీడీఏ పిఓను ఆదేశించారు. అలాగే పెండింగ్లో ఉన్న ఆధార్ కార్డులు, ఆరోగ్యశ్రీ కార్డు, పెన్షన్ల జారీకి వెంటనే చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. గూడెంలలో రక్తహీనత గల స్త్రీలు, పోషక లోపాలున్న వ్యక్తులను గుర్తించేందుకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి తగు చర్యలు తీసుకోవాలని డియంహెచ్ఓను కలెక్టర్ ఆదేశించారు.

# ఉత్తరాంధ్ర అభివృద్ధికి ప్రభుత్వం కృషి: మంత్రి అమర్‌నాథ్



విశాఖపట్నం: ఉత్తరాంధ్ర ప్రాంతాన్ని అనేక ప్రాజెక్టులతో అభివృద్ధి చేస్తున్నామని ఏపీ ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. మంగళవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ, ఇప్పటికే మూలపేట పోర్టుకు సీఎం జగన్ శంకుస్థాపన చేశారని, ఆ పోర్టు ద్వారా పారిశ్రామిక అభివృద్ధి జరుగుతుందన్నారు. మూలపేట పోర్ట్ పనులు త్వరితగతిన జరుగుతున్నాయి. మరో రెండున్నరేళ్లలో మూలపేట పోర్టు పూర్తి కానుంది. భోగాపురం ఎయిర్‌పోర్ట్, డేటా సెంటర్‌కు సీఎం జగన్ శంకుస్థాపన చేస్తారని మంత్రి తెలిపారు."రూ.3,500 కోట్లతో భోగాపురం ఎయిర్‌పోర్ట్ నిర్మాణం జరగనుంది. 2025 సెప్టెంబర్ లోపు ఎయిర్‌పోర్ట్ పూర్తి చేయాలన్నది లక్ష్యం. టెక్ పార్క్ ద్వారా లక్షకుపైగా ఉద్యోగాల కల్పన లక్ష్యం. రూ.6,500 కోట్లతో భోగాపురం విశాఖ మధ్య 6 లేన్ల రోడ్డు నిర్మాణానికి కేంద్రమంత్రి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. హైదరాబాద్-సైబరాబాద్ ట్విన్ సిటీస్ మాదిరిగా భవిష్యత్‌లో విశాఖ-విజయనగరం అభివృద్ధి చెందుతాయి" అని అమర్‌నాథ్ అన్నారు."ఎప్పుడైనా చంద్రబాబు ఉత్తరాంధ్ర అభివృద్ధికి ఏదైనా ప్రాజెక్ట్ తీసుకువచ్చారా? 2019 ఫిబ్రవరి 15న ఎన్నికల నోటిఫికేషన్ వస్తుందని తెలిసీ భోగాపురం ఎయిర్‌పోర్టుకు శంకు స్థాపన చేశారు. ఆ సమయంలో కనీసం భూ సేకరణ, రన్ వే కోర్టు క్లియరెన్స్‌లు తీసుకోలేదు. సిమెంట్ పలక ఉంటే చాలు.. చంద్రబాబు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపన చేసేస్తారు" అంటూ మంత్రి అమర్‌నాథ్ ఎద్దేవా చేశారు.

## సామూహిక శ్రమదాన కార్యక్రమ నిర్వహణకు ఏర్పాట్లు సిద్ధం చేయండి

### టీటీడీ ఈవో ఎవి ధర్మారెడ్డి

ప్రపంచ ప్రసిద్ధి చెందిన తిరుమలను ప్లాస్టిక్ రహిత క్షేత్రంగా మార్చడానికి మే 13న నిర్వహిస్తున్న సామూహిక శ్రమదాన కార్యక్రమం విజయవంతం చేయడానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని టీటీడీ ఈవో ఎవి ధర్మారెడ్డి అధికారులను ఆదేశించారు. తిరుపతి టీటీడీ పరిపాలనభవనంలోని తన చాంబర్లో మంగళవారం ఆయన ఈ అంశంపై సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ పారిశుద్ధ్య నిర్వహణలో పనిచేసిన ఉద్యోగుల, శ్రీవారి సేవకుల స్ఫూర్తితో రెండు ఘాట్‌రోడ్లు, నడక మార్గాలను ప్లాస్టిక్ రహితంగా మార్చేందుకుసామూహిక శ్రమదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆయన చెప్పారు. ఇందుకోసం ఎంతమంది సిబ్బంది కావాలి, వారికి ఎలాంటి సదుపాయాలు కల్పించాలి అనే విషయాలపై ఈవో అధికారులతో చర్చించారు. ఉద్యోగులు , శ్రీవారి సేవకులకు అవసరమైన మాస్కులు, బకెట్లు, చీపుర్లు, తాగునీరు, అల్పాహారం సిద్ధం చేసుకోవాలన్నారు. శ్రీవారి సేవకులు, సిబ్బంది రవాణా కు అవసరమైన వాహనాలు ముందుగానే సిద్ధం చేయాలని ఆయన చెప్పారు. ఘాట్ రోడ్లు, నడక మార్గాల్లో పోగయ్యే చెత్తను డంపింగ్ ప్రాంతాలకు తరలించేందుకు వాహనాలను ఏర్పాటు చేయాలన్నారు.

# ఉగ్రం ఆ హీరో ఎందుకు కాదన్నాడో..?




నాందితో హిట్ కాంబోగా నిలిచిన విజయ్ అల్లరి నరేష్ డైరెక్టర్ హీరో జోడీ తమ నెక్స్ట్ సినిమా ఉగ్రం తో కూడా అదే రిజల్ట్ ని రిపీట్ చేయాలని చూస్తున్నారు. అల్లరి నరేష్ హీరోగా విజయ్ కనకమేడల దర్శకత్వంలో తెరకెక్కిన ఉగ్రం మే 5న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. నరేష్ ఫుల్ లెంగ్త్ మాస్ అండ్ కమర్షియల్ సినిమా చేసిన ఈ ఉగ్రం సినిమాపై హీరో చాలా నమ్మకంగా ఉన్నాడు. ప్రచార చిత్రాలు కూడా ఆసక్తి కలిగించడంతో సినిమా నరేష్ ఖాతాలో మరో హిట్ పడేస్తుందని అంటున్నారు. నాంది తర్వాత విజయ్ కనకమేడల కళ్యాణ్ రామ్ కి ఒక కథ చెప్పారట. అది ఉగ్రం కథే అని టాక్. అయితే కళ్యాణ్ రామ్ పటాస్ లో పోలీస్ రోల్ చేశారు. ఈ సినిమా ఫుల్ లెంగ్త్ సీరియస్ రోల్ అవడం తో ఎక్కడో చిన్న అనుమానంతో కాదన్నారట. కళ్యాణ్ రామ్ చెప్పినప్పుడు కేవలం ఐడియా మాత్రమే అని నరేష్ కి ఫుల్ స్క్రిప్ట్ చెప్పడంతో ఆయన వెంటనే ఓకే చేశారని దర్శకుడు విజయ్ కనకమేడల చెప్పారు. ఉగ్రం సినిమాలో నరేష్ యాక్షన్ సీన్స్ కోసం చాలా కష్టపడినట్టు తెలుస్తుంది. నరేష్ ని ఎప్పుడు అల్లరి చిల్లరి పాత్రల్లో చూసిన ప్రేక్షకులు సీరియస్ మోడ్ లో చూసేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. నాంది రిజల్ట్ తో నరేష్ కి ఆ విషయం అర్థమైంది. అందుకే ఇక వరుస డిఫరెంట్ గా ఉండే మాస్ కథలను ఎంచుకుంటున్నాడు. ఉగ్రం హిట్ పడితే కచ్చితంగా ఈ సినిమా వదులుకున్న హీరో అర్రె మంచి సినిమా మిస్ చేసుకున్నామని అనుకోక తప్పదు. అయినా సినీ పరిశ్రమలో ఒకరి కోసం అనుకున్న సినిమా మరొకరు చేయడం అనేది చాలా కామన్. ఉగ్రం లో అల్లరి నరేష్ పోలీస్ పాత్రలో కనిపిస్తున్నారు. సినిమా కోసం నరేష్ సిగరెట్లతో పాటుగా నెల రోజుల పాటు నైట్ షూట్స్ కూడా చేసినట్టు తెలుస్తుంది.

# ఏజెంట్ గురించి వాళ్లు కూడా ఓపెన్ అయితే బెటర్..!


ఒక సినిమా భారీ అంచనాలతో వచ్చి డిజాస్టర్ టాక్ తెచ్చుకుంటే ఆ మేకర్స్ మీద ఉండే ప్రెజర్ అందరికి తెలిసిందే. కమర్షియల్ లెక్కల కన్నా ఆడియన్స్ చేసే ట్రోల్స్ కే వారికి ఎక్కువ బాధ ఉంటుంది. అఫ్ఫోర్స్ సినిమాపై ముందు బజ్ పెంచడం లాంటి వారి యాక్షన్ కి ఆడియన్స్ రియాక్షన్ కూడా తప్పుపట్టలేం కానీ సినిమా హిట్టు ఫ్లాప్ అన్నది ఎవరి చేతుల్లో ఉండదు. రిలీజై ఆడియన్ చేత సూపర్ అనిపించే వరకు సినిమా ఫలితం ఎవరు ఊహించలేరు. రీసెంట్ గా వచ్చిన అఖిల్ ఏజెంట్ నిరాశపరచింది అన్నది తెలిసిందే. కానీ సినిమా ఫెయిల్యూర్ కి వారు కారణం వీళ్లు కారణం అని చెప్పి



ట్రోల్స్ చేయడం మాత్రం సరైనది కాదు. ఒక్కోసారి మనం అనుకున్నది మరొకరి నచ్చదు అలానే ఏజెంట్ విషయంలో అన్ని అలా సినిమా రిజల్ట్ కు కారణమయ్యాయి. అయితే సినిమా ఫెయిల్యూర్ ని యాక్సెప్ట్ చేస్తూ ఏజెంట్ నిర్మాత అనిల్ సుంకర బౌండెడ్ స్క్రిప్ట్ లేకుండానే సెట్స్ మీదకు వెళ్లామని చెప్పడం అందరిని సర్ ప్రైజ్ చేసింది. ఏజెంట్ ఫెయిల్యూర్ ని ఒప్పుకుంటూ ఈ సినిమా నిరాశపరచిందని.. ఈ తప్పులు ఫ్యూచర్లో జరగకుండా చూస్తామని అన్నారు నిర్మాత అనిల్ సుంకర. నిర్మాత నుంచి ఈ స్టేట్ మెంట్ నిజంగా డేర్ స్టెప్ అని చెప్పొచ్చు. అయితే ఇలానే ఏజెంట్ హీరో అఖిల్ డైరెక్టర్ సురేందర్ రెడ్డి కూడా ఓపెన్ అయ్యి సినిమా ప్రేక్షకుల అంచనాలకు రీచ్ అయ్యేలా అందించలేక పోయామని మాట్లాడితే బెటర్ అని అంటున్నారు. ఈమధ్య స్టార్ హీరోల సినిమాలు విపరీతమైన బజ్ తో వచ్చి డిజాస్టర్ టాక్ తెచ్చుకుంటే ఆ హీరో ఫ్యాన్స్ కు అలాంటి ఓపెన్ లెటర్ ఒకటి పెడుతున్నారు. చరణ్ వినయ విధేయ రామ టైం లో అదే చేశాడు. ఇప్పుడు అఖిల్ కూడా అదే తరహాలో అభిమానులకు ఓపెన్ లెటర్ రాస్తే బెటర్ అని అంటున్నారు. సురేందర్ రెడ్డి కూడా ఇలాంటి ఒక ఓపెన్ స్టేట్మెంట్ ఇస్తే బాగుంటుందని చెప్పుకుంటున్నారు. కెరీర్ అన్న తర్వాత హిట్లు ఫ్లాపులు చాలా కామన్ కానీ దాన్ని ఒప్పుకుని నెక్స్ట్ సినిమాకు వెళ్లడంలో క్లవర్ గా ప్రవర్తించాల్సి ఉంటుంది.

# అనిరుధ్ ఖాతాలో బడా ఆఫర్లు.. రూ.కోట్ల వర్షమే..!

తమిళ మ్యూజిక్ డైరెక్టర్ అనిరుధ్ కి ఉన్న క్రేజ్ గురించి ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. మోస్ట్ వాంటెడ్ మ్యూజిక్ కంపోజర్. కేవలం తమిళ్ మాత్రమే కాదు.. తెలుగులోనూ సత్తా చాటింది. చిన్నాపెద్దా తేడా లేకుండా అందరూ ఎంజాయ్ చేసేలా మ్యూజిక్ అందించే టాలెంట్ యువ సంగీత దర్శకుల్లో టాప్లో ఉ



ంటాడు ఈ స్టార్ మ్యూజిక్ డైరెక్టర్. ఈ స్టార్ కంపోజర్ సినిమా ఎలాంటిదైనా హీరో ఎవరైనా కథ ఎలాంటిదైనా సరే తన మార్క్ మాత్రం తప్పక ఉండేలా చూసుకుంటాడు. ప్రస్తుతం బ్యాక్ టు బ్యాక్ సినిమాలతో ఫుల్ బిజీగా ఉన్న మ్యూజిక్ డైరెక్టర్లలో అనిరుధ్ ఒకడు. ప్రస్తుతం అనిరుధ్ చేతిలో పెద్ద సినిమాలు ఎనిమిది ఉన్నాయి. వాటిలో ఒక్కోసినిమా కి రూ.5 నుంచి రూ.6 కోట్లు వరకు వసూలు చేయనున్నాడు. ఈలెక్కన అనిరుధ్ ఖాతాలో రూ. కోట్ల వర్షం కురియనుంది. కోలీవుడ్ సూపర్ స్టార్ రజినీకాంత్ హీరోగా తమన్నా హీరోయిన్ గా తాజాగా నెల్సన్ దిలీప్ కుమార్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న యాక్షన్ ఎంటర్టైనర్ మూవీ జైలర్. సన్ పిక్చర్స్ బ్యానర్ పై కళానిధి మారన్ గ్రాండ్ గా నిర్మిస్తున్నారు. ఈ సినిమాకి మ్యూజిక్ అనిరుధ్ అందిస్తున్నారు. ఈ సినిమా ఈ ఏడాదే విడుదల కానుంది. ఇక రజినీకాంత్ మరో సినిమా తలైవా170. ఈ సినిమా 2024లో థియేటర్లలో సందడి చేయనుంది. తలైవా 170 ప్రొడక్షన్ పనులను వన్ ఆఫ్ ది లైకా ప్రొడక్షన్స్ ప్రొడ్యూసర్ జీకేఎం తమిళ్ కుమరన్ పర్యవేక్షించనున్నారు. మొత్తానికి ఈ సారి టీజే జ్ఞానవేల్ సూపర్ స్టార్ రజినీకాంత్ను ఎలా చూపించబోతున్నాడన్నది ఆసక్తికరంగా మారింది. కాగా ఈ సినిమాకి కూడా అనిరుధ్ మ్యూజిక్ అందించనున్నాడు. ఈ సినిమాకి కూడా ఆయన రూ.5 నుంచి రూ.6కోట్లు తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. ఇక కమల్ హాసన్ భారతీయుడు సీక్వెల్ ఇండియన్ 2 సినిమా కూడా త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రానుంది. దీనికి శంకర్ దర్శకత్వం వహిస్తుండగా దీనికి కూడా అనిరుధ్ మ్యూజిక్ అందిస్తున్నారు. త్వరలో ప్రేక్షకుల ముందుకు రావడానికి రెడీగా ఉన్న విజయ్ లియో సినిమాకి సైతం అనిరుధ్ మ్యూజిక్ అందిస్తుండటం విశేషం. దీనికి లోకేష్ కనకరాజ్ దర్శకత్వం వహిస్తున్నారు. షారూక్ అట్లీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న సినిమా జవాన్ కీ ఎన్టీఆర్ కొరటాల శివ కాంబినేషన్ లో వస్తున్న ఎన్టీఆర్ 30కి కూడా అనిరుధ్ మ్యూజిక్ అందిస్తున్నారు. ఈ రెండు సినిమాల మ్యూజిక్ పై అంచనాలు చాలా ఎక్కువగా ఉన్నాయి. ఇక విజయ్ దేవరకొండ గౌతమ్ మీనన్ కాంబినేషన్ లో వస్తున్న సినిమా కి కూడా అనిరుధ్ సంగీతం సమకూర్చనున్నారు.

# నేపాల్ సంచలనం.. ఇండియా, పాకిస్తాన్‌లతో కలిసి! ఇంతకీ టోర్నీ సంగతేంటి?

నేపాల్ క్రికెట్ జట్టు తొలిసారి ఆసియా కప్ టోర్నీకి అర్హత సాధించింది. ఆసియా క్రికెట్ కౌన్సిల్ మెన్స్ ప్రీమియర్ కప్ ఫైనల్లో యూఏఈని ఓడించి మెగా ఈవెంట్ బెర్తు ఖరారు చేసుకుంది. నేపాల్- యూఏఈ మధ్య మంగళవారం ఖాట్మండు వేదికగా మ్యాచ్ జరిగింది. ఈ క్రమంలో గుల్షన్ కుమార్ ఝా 67 పరుగులతో చెలరేగిన నేపథ్యంలో నేపాల్ ఏడు వికెట్ల తేడాతో గెలుపొందింది. ఈ క్రమంలో ఆసియా కప్ ఈవెంట్‌కు అర్హత సాధించిన నేపాల్ గ్రూప్-ఏలో చోటు దక్కించుకుంది. ఇండియా, పాకిస్తాన్ జట్లతో చేరి పోటీకి సిద్ధమైంది. 4 వికెట్లు పడగొట్టిన రాజ్ బన్షీటాస్ గెలిచి తొలుత బౌలింగ్ ఎంచుకున్న నేపాల్.. యూఏఈని 117 పరుగులకే కట్టడి చేసింది. రాజ్‌బన్షీ అత్యధికంగా 4 వికెట్లు పడగొట్టగా.. కరణ్ కేసీ, సందీప్ లమిచానే రెండేసి వికెట్లు కూల్చారు. సోంపాల్ కామి, గుల్షన్ ఝా చెరె వికెట్ తమ ఖాతాలో వేసుకున్నారు. దీంతో 33.1 ఓవర్లకే యూఏఈ కథ ముగిసింది. ఆదిలోనే ఎదురుదెబ్బ.. అయినా గానీఇక లక్ష్య ఛేదనకు దిగిన నేపాల్‌కు ఆరంభంలోనే గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఓపెనర్లు కుశాల్ భూర్టెల్ 1, ఆసిఫ్ షేక్ 8 పరుగులకే పెవిలియన్ చేరారు. ఈ క్రమంలో వన్‌డౌన్ బ్యాటర్ గుల్షన్ ఇన్నింగ్స్ చక్కదిద్దే బాధ్యత నెత్తికెత్తుకున్నాడు. 84 బంతుల్లో 3 ఫోర్లు, 5 సిక్స్‌ల సాయంతో 67 పరుగులు సాధించి ఆఖరి వరకు అజేయంగా నిలిచాడు. అతడి తోడుగా భీమ్ షార్కీ 72 బంతుల్లో 36 పరుగులతో పట్టుదలగా నిలబడ్డాడు. వీరిద్దరి ఇన్నింగ్స్ కారణంగా 30.3 ఓవర్లలోనే నేపాల్ టార్గెట్ ఛేదించింది. అలాంటిదేమీ లేదుఇదిలా ఉంటే.. ఆసియా వన్డే కప్-2023 టోర్నీ నిర్వహణ హక్కులను పాకిస్తాన్ దక్కించుకున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో భారత క్రికెట్ నియంత్రణ మండలి తమ ఆటగాళ్లను పాక్‌కు పంపే పరిస్థితి లేదని కరాఖండిగా చెప్పింది.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY **AVULA VIJAYA BHASKARA REDDY** PRINTED AT **SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2, OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH.**
**PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY, 7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190**